www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 19 | హైదరాబాద్ | మంగళవారం,జూన్ 23 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన..

### ఉద్యోగులకు, విద్యార్థులకు పోలీసుల కీలక అడ్వైజరీ



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు జారీ చేశారు. సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, ఇతర

2లో..

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో

# సీఎం రేవంత్ రెడ్డి

### - తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు



**ఢిల్లీ, :** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమార్వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

### ఓట్లను తొలగించేందుకే

## బీజేపీ సర్ తెచ్చింది

**- మీనాక్షి నటరాజన్**



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ ఓట్లను తొలగించేందుకే బీజేపీ సర్ తెచ్చిందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ. గతంలో ఓటు హక్కు ఇచ్చేందుకు సర్ జరిగింది. ఇప్పుడు బీజేపీ కోసమే ఎస్ఐఆర్ నడుస్తోంది. ఓటు హక్కు మాత్రమే కాదు పౌరసత్వాన్ని కూడా తొలగిస్తున్నారు. ఈ దేశ పౌరులను శరణార్థులుగా మార్చే పని చేస్తోంది. బీజేపీ అమానవీయ ప్రయత్నాలను మనమే అడ్డుకోవాలి అని అన్నారు.

## హర్మూజ్ జలసంధిని మూసివేస్తే

# ఊరుకోం

### డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

- 60 రోజుల్లో ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో భారీ టోల్ విధిస్తాం
- పశ్చిమాసియాకు అందించిన రక్షణ సేవలకు ఆ డబ్బు వసూలు చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు
- ప్రస్తుతం హర్మూజ్ ఇరాన్ నియంత్రణలో లేదు.. రవాణా సాఫీగా సాగుతోంది: యూఎస్ సెంట్రల్ కమాండ్
- లెక్కచెయ్యని ఇజ్రాయిల్.. లెబనాన్‌పై కొనసాగుతున్న బీకర దాడులు




**అమెరికా , జూన్ 22:** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే 60 రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం గనుక కుదరకపోతే హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ విధిస్తామని ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమాసియా దేశాలకు ఇప్పటివరకు అమెరికా అందించిన భద్రత, రక్షణ సేవలకు ప్రతిఫలంగా ఆ టోల్ డబ్బును తీసుకోనున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం రాబోయే 60 రోజుల పాటు ఈ మార్గంలో ఎలాంటి టోల్-రహిత (ఉచిత) ప్రయాణం ఉండాలని ఆయన గుర్తు చేశారు. మరోవైపు హర్మూజ్ జలసంధి ప్రస్తుతం ఇరాన్ పూర్తి నియంత్రణలో లేదని, అక్కడ అంతర్జాతీయ నౌకల రవాణా ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగుతోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ వెల్లడించారు. సముద్ర మార్గంలో పరిస్థితి ఇలాగే ప్రశాంతంగా ఉండేలా చూసేందుకు అమెరికా సైనిక దళాలు తగిన చర్యలు

2లో..

## నేను కేసీఆర్ అంత

# మంచోణ్ని కాదు

### వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం
- వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపిస్తానన్న కేటీఆర్
- వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు

2లో..



## లక్నో అగ్నిప్రమాదంలో

# 14 మంది మృతి

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



**లక్నో** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14

## కీలక సంస్థల భద్రతలో

# సీఐఎస్ఎఫ్‌కు పెను సవాళ్లు

- దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సంస్థలపై దాడే శత్రువుల ప్రధాన లక్ష్యం
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కండి
- ఆధునిక సాంకేతికతను సమకూర్చుకోండి
- అవసరమైన అన్ని వనరులను అందించేందుకు కేంద్రం సిద్ధం
- ప్రపంచంలోనే అత్యాధునిక భద్రతా దళంగా సీఐఎస్ఎఫ్ ను తీర్చిదిద్దుతాం
- మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తాం
- సీఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయం
- పర్యావరణ పరిరక్షణలో సీఐఎస్ఎఫ్ సేవలు భేష్
- జవాన్ల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ (భారత శక్తి)** న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సీఐఎస్ఎఫ్ నూతన ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రిప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ కు కొత్త భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువులకు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రతా బాధ్యత మరింత పెరిగిందన్నారు. యుద్ధాల ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదని, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ దిశగా మోదీ ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను

2లో..

### బ్రిటన్ రాజకీయాల్లో

# సంచలనం

### - ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!



బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం

2లో..

# 10 సూత్రాల అమలు..

### సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

- స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం
- ప్రణాళికా విభాగంతో కేఆర్ఈఏ వర్సిటీకి చెందిన ఐఎఫ్ఎంఆర్ ఎంఓయూ
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జీరో పావర్టీ, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై తొలుత దృష్టి
- పది సూత్రాల అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ, వర్కింగ్ గ్రూపుల ఏర్పాటు

2లో..



### నీటి వాటాపై రాజీపడే

## ప్రసక్తే లేదు

**ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో

2లో..

# ఇంటింటికీ ప్రజా ప్రభుత్వ సంక్షేమం



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పదేళ్ల గత పాలకుల నిర్లక్ష్యానికి చెక్..
- ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండ
- మహిళా సాధికారతకు కాంగ్రెస్ పెద్దపీట..
- 30 నెలల్లో రూ. 67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ

**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఇంటికీ చేరుతోందని, ఈ అద్భుత ప్రగతిని మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం జిల్లా

2లో..

భారత శక్తి
VOICE OF INDIAN
మంగళవారం, జూన్ 23, 2026

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు. కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.

# 10 సూత్రాల అమలు..

అమరావతి (భారత శక్తి) ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047 విజన్' అమలులో ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా నిర్దేశించిన పది సూత్రాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రణాళికా విభాగం, కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాధన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో 13.5 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) సాధించామని, అయితే గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల అది 11 శాతానికి పరిమితమైందని విశ్లేషించారు. ఇప్పుడు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ), వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్‌ను ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఐఎఫ్ఎంఆర్ చూస్తుంది. తొలిదశలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన), వాటర్ సెక్యూరిటీ (జల భద్రత), డీప్ టెక్నాలజీ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, విధానపరమైన సూచనలు అందించడంతో పాటు, వినూత్న పద్ధతులను సిఫారసు చేస్తుంది. ఈ పది సూత్రాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు, మిషన్ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి డీప్ టెక్‌ను అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, సెమీ కండక్టర్స్, రక్షణ రంగాల్లో కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలను సైతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం

తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

# లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి

మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత

## – మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి** : విజయవాడ సోమవారం స్థానిక స్వర్ణ ప్యాలెస్ లో మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 45వ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన వెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎం వి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు వెంకట రమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు,డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# హార్ముజ్ జలసంధిని మూసివేస్తే ఊరుకోం

తీసుకుంటున్నాయన్నారు. కేవలం శనివారం ఒక్కరోజే సుమారు 17 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురుతో కూడిన 55 వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు ఆయన కీలక వివరాలు వెల్లడించారు. ఓ వైపు అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు మొదలుకానుండగా మరో వైపు ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. సరిహద్దుల వద్ద పలువురు ఇజ్రాయెల్ ప్రజలు పాలస్తీనీయులపై దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడానికి తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందని హెజ్‌బొల్లా ఆరోపించింది. శనివారం లెబనాన్‌లోని 100కు పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని అనేక పౌర నివాసాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.

# హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన..

కార్యాలయాలు, విద్యాసంస్థలు సోమవారం నుంచి సాయంత్రం 3:30 గంటల నుంచే ఉద్యోగులను, విద్యార్థులను విడతల వారీగా ఇళ్లకు పంపాలని సూచించారు. భారత వాతావరణ శాఖ కథనం ప్రకారం, రాష్ట్రంలో జూన్ 27 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జూన్ 24 వరకు ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గతంలో భారీ వర్షాల కురిసిన సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల కలిగే రద్దీని నివారించేందుకే ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు నగరంలో భారీ వర్షం నమోదు కానప్పటికీ, రానున్న రోజుల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్‌కు పెను సవాళ్లు

సీఐఎస్ఎఫ్ అందించడానికి కట్టుబడి ఉందన్నారు. న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ లో రూ. 75.78 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (అమోఈ) నూతన ప్రధాన కార్యాలయ భవనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, హోం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కేంద్ర సాయుధ పోలీసు దళాల అధిపతులు, సీపీడబ్ల్యూడీ సీనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఈ రోజు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (అమోఈ) చరిత్రలో ఒక మైలురాయి. న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సుమారు రూ. 75.78 కోట్ల వ్యయంతో నిర్మించబడనున్న ఆధునిక, అన్ని సౌకర్యాలతో కూడిన 9 అంతస్తుల కొత్త సీఐఎస్ఎఫ్ కేంద్ర ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హైదరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (ఔమోం), తమిళనాడులో సుమారు రూ. 60.25 కోట్ల వ్యయంతో నిర్మించిన నివాస సముదాయాలు, బ్యారక్‌లు, ఆధునిక శిక్షణ సదుపాయాలను కూడా ప్రారంభించుకున్నాం. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు కొత్త భద్రతా సవాళ్లను మన ముందుంచుతున్నాయి. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే గ్లోబల్ సప్లై చైన్లపైన, కీలక మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువుల ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రత బాధ్యత సీఐఎస్ఎఫ్ భుజాలపై ఉండటంతో తాజా పరిణామాలతో బాధ్యత మరింత పెరిగింది. ఇప్పుడు ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదు. సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ముప్పులు పెరుగుతున్నాయి. అందువల్ల సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ దిశగా ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను అందించడానికి కట్టుబడి ఉంది. దేశ అవసరాలు మారుతున్న కొద్దీ సీఐఎస్ఎఫ్ బాధ్యతలు కూడా విస్తరిస్తున్నాయి. భారత బ్లూ ఎకానమీ రక్షణ కోసం, అంతర్జాతీయ మోఖూ కోడ్ కింద సీఐఎస్ఎఫ్‌ను గుర్తింపు పొందిన భద్రతా సంస్థ (ఖీూా)గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గుర్తించింది. దీని ద్వారా భవిష్యత్తులో దేశంలోని 72 ఎగుమతి-దిగుమతి ఓడరేవుల భద్రతలో సీఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించనుంది. హైదరాబాద్‌లోని ఔమోంలో పోర్ట్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు



కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# ఇంటింటికీ ప్రజా ప్రభుత్వ సంక్షేమం

కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా లోకానికి సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గత పాలకుల పదేళ్ల నిరంకుశ పాలనలో పేద ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూసి అలసిపోయారని భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తుచేశారు. "గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి 2,000 చొప్పున ఇళ్లు కేటాయించాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉండి ఇళ్లు రాకుంటే మా దృష్టికి తీసుకురండి, వారికి తప్పకుండా మంజూరు చేస్తాం" అని హామీ ఇచ్చారు. పేద పిల్లల ఉన్నత చదువుల కోసం ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వంద రోజుల పని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం ఇల్లు, భూమి, బంగారం అమ్ముకునే దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఏకంగా రూ.10 లక్షలకు పెంచామని డిప్యూటీ సీఎం తెలిపారు. దీని ద్వారా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యం అందుతోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని కొనియాడారు. ఐదేళ్లలో డ్వాక్రా మహిళలకు లక్ష కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, కేవలం రెండున్నర ఏళ్లలోనే రూ. 67,000 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. వడ్డీ లేని రుణ పరిమితిని సైతం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా.. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించి, మహిళలనే ఆ బస్సులకు యజమానులను చేసిన ఘనత మన ప్రజా ప్రభుత్వానికే దక్కుతుంది" అని గర్వంగా ప్రకటించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, మరియు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి )ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి




వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్ధంగా ఉండాలన్నారు. శాఖలవారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందాలి

## – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి )అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రెండో దశ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో ఎంపీడీవో లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెల్లో నివసించే అర్హులైన పేదలందరికీ రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను అందివ్వాలని తెలిపారు. రెండో దశలో మంజూరైన ఇండ్లు, దరఖాస్తుల పరిశీలన, అనుమతించిన ఇండ్లు, ఎంపీడీవో లాగిన్ ల నుండి కలెక్టర్ లాగిన్లకు పంపిన ఇండ్లు, తదితర వివరాలను మండలాల వారిగా ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనుమతుల ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. రోజు వారీగా సంబంధిత రిపోర్టులన్నీ తమకు అందజేస్తూ ఉండాలని వివరించారు. ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ ట్రస్ట్‌లో భువనేశ్వరి పుట్టిన రోజు



ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన పుట్టిన రోజును సోమవారం ఎన్‌టిఆర్ ట్రస్ట్‌లో తలసేమియా పిల్లలతో జరుపుకున్నారు. పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వారికి చాక్లెట్‌లు, గిఫ్ట్ హాంపర్స్‌ను పంచిపెట్టి, పిల్లలతో కలిసి భోజనం చేసి తదనంతరం పిల్లలతో ముచ్చటించడం జరిగింది. తలసేమియా బారినపడి తల్లడిల్లుతున్న బాలబాలికలను నారా భువనేశ్వరి అన్ని విధాలా ఆదుకుంటున్నారు. వీరి కోసం విశాఖపట్నం, హైదరాబాద్ నగరాలలో భారీ ఎత్తున 'తలసేమియా రన' ను 'యుఫోరియా మ్యూజికల్ నైట్' ను విజయవాడలో నిర్వహించారు. తలసేమియా వ్యాధి ఉన్నవారు నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సి ఉంటుంది. ఉచిత రక్తనిధి ద్వారా వందలాది చిన్నారులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. తలసేమియా బాధిత పిల్లలకు నారా భువనేశ్వరి ఒక ఆశాదీపంగా ఉంటున్నారు. ఈ నా పుట్టిన రోజును ఎన్‌టిఆర్ ట్రస్ట్‌లో తలసేమియా కేర్ సెంటర్‌లో ఉన్న పిల్లల మధ్య జరుపుకోవడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఎన్‌టిఆర్ ట్రస్ట్ తలసేమియా బాధితుల కోసం ఉచిత రక్తమార్పిడి, అవసరమైన మందులు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాము. దేశ వ్యాప్తంగా తలసేమియా బాధితులు ఎక్కడ ఉన్నా సరే ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున వారికి సహాయం అందించడం కోసం మేము సిద్దంగా ఉన్నాము. మరి కొద్ది రోజుల్లో తలసేమియా కేర్ సెంటర్ విజయవాడలో ప్రారంభిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్ (ఐపీఎస్ రిటైర్డ్), సీవోవో అడుసుపల్లి గోపి, హెరిటేజ్ హోల్‌టైమ్ డైరెక్టర్ డా.ఎం. సాంబశివరావు, ఎన్‌టిఆర్ ట్రస్ట్, హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి

VOICE OF INDIAN

## విరాళాల వివాదం

అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు.ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు.ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు.ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు.ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలు-కానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు.ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు.“ శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు” అన్నారు.చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు.అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్-మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు.గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు.

అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు.మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు.ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి.
ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. ‘ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది’ అని ఆరోపించారు.ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి.అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు.ఈ ఆరోపణలు ‘తప్పుదోవ పట్టించేవిగా, ‘రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా’ ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు.కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు.ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ అంకిత్





భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22 (భారతశక్తి): ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను శ్రద్ధగా విని, ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజా సేవలో పారదర్శకత, జవాబు దారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంత మవుతుందని తెలిపారు. ప్రజావాణిలో అందిన పలు వినతులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.

**- ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన వేపల లక్ష్మి తాను ఇంజినీరింగ్ పూర్తి చేశానని, భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఇద్దరు పిల్లల సంరక్షణ బాధ్యత తనపై ఉందని పేర్కొంటూ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ ఉపాధి కల్పన అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన షేక్ సఫియా తాము నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, వర్షాకాలంలో వర్షపు నీరు ఇంట్లోకి చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరుపు సత్యవతి తాము నిరుపేద కుటుంబానికి చెందినవారమని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామపంచాయతీకి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలోని చెరువులు, వాగుల్లో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. గతంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి గ్రామపంచాయతీ పేరుతో కొనసాగిందని, నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో రామచంద్రునిపేట గ్రామపంచాయితీ ఏర్పడినందున ఆ గ్రామపంచాయితీ పేరుతో కొత్త మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ జిల్లా మత్స్యశాఖ అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు. పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయనిర్మల, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదనే కారణంతో తనను విధుల నుండి తొలగించారని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర పాఠశాలల్లో ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులను తొలగించలేదని, తనకు న్యాయం చేసి తిరిగి విధుల్లో కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌సీఓకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలి

**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 22( భారత శక్తి): యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యువత లక్ష్యాలను ఉంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తమ తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మందికి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. విదేశాలలో స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, పనిలో బాస్ మేనేజ్మెంట్ 70 శాతం ఉంటే పని 30 శాతం ఉంటుందని, అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగతా సమయంలో ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే విజయం సాధిస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భాష శిక్షణను నిదానంగా, స్పష్టంగా నేర్చుకోవాలని శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించాలని, నైపుణ్యం సంపాదించాలని తెలిపారు. విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలకి పంపండి.. వెయ్యి రూపాయలు పొందండి.

**ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడానికి గ్రామ సర్పంచులు, డాక్టర్స్, ఉపాధ్యాయులు, సమాజం పట్ల నిబద్ధత కలిగిన పలువురు ప్రముఖులు పలు రకాల ఆఫర్స్ ప్రకటిస్తున్నారు.**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి ) ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడానికి గ్రామ సర్పంచులు, డాక్టర్స్, ఉపాధ్యాయులు, సమాజం పట్ల నిబద్ధత కలిగిన పలువురు ప్రముఖులు పలు రకాల ఆఫర్స్ ప్రకటిస్తున్నారు. తాజాగా నిర్మల్ జిల్లా బైంసా మండలం లింగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఇక్కడి ఉపాధ్యాయుడు బిజ్జుర్వార్ సాయినాథ్ రూ.1000 నజరానా ఆఫర్ ను ప్రకటించారు. పాఠశాలలో అడ్మిషన్ అయిన ప్రతి విద్యార్థికి ప్రతి నెల రూ.1000 ఆఫర్ ని ప్రకటించారు. ఈ డబ్బులను తన సొంత జీతం నుండి చెల్లిస్తానని ప్రకటించారు. సున్నా సంఖ్య గల ఈ పాఠశాల గత కొన్ని సంవత్సరాలుగా మూతపడి ఉంది. అధికారుల నిర్ణయం మేరకు ఈ సంవత్సరం పాఠశాల తెరవాలి అన్న నిబంధన రాగా, విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసమే ఇక్కడి ఉపాధ్యాయుడు సాయినాథ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. అసలే విద్యార్థులు లేని ఈ పాఠశాలలో ఈ ఆఫర్ ప్రకటించిన నాటి నుండి ముగ్గురు విద్యార్థులు అడ్మిషన్లు అయ్యారంటూ తెలిపారు. అయితే ఇది విన్న ప్రజలు, విద్యార్థి దశలోనే విద్యార్థులకు వేతనమంటూ గుసగుసలాడుకుంటున్నారు.

## టీబీఎఫ్ స్టోర్స్ - మల్టీ బ్రాండ్స్ మెన్స్ స్టోర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిలుక ఉపేందర్ రెడ్డి.



ఎల్బీనగర్, జూన్ 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని మార్గదర్శి కాలనీలో అష్టలక్ష్మీ దేవాలయ ఆర్చ్ లోపల నూతనంగా టీబీఎఫ్ స్టోర్స్ -- మల్టీ బ్రాండ్స్ మెన్స్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్ రెడ్డి.ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, నూతనంగా ప్రారంభమైన టీబీఎఫ్ స్టోర్స్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం మరింత అభివృద్ధి చెంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వ్యాపార రంగంలో విజయవంతంగా ముందుకు సాగాలని కోరారు.

## నిరుద్యోగ నిరసన: ఖాళీలు భర్తీ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు.

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి మండిపాటు**

**- 2లక్షల ఉద్యోగాల భర్తీకి తక్షణ డిమాండ్**



హైదరాబాద్:జూన్ 22 భారత శక్తి రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకుండా యువతను మోసం చేస్తోందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 50 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు, 5 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయకపోవడం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటమేనని దుయ్యబట్టారు.

**- కీలక శాఖల్లో నిలిచిన నియామకాలు**

పోలీస్ శాఖలో 18 వేల కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మైనారిటీ, ఎయిడెడ్ పాఠశాలల్లో 30 వేల ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం పక్కన పెట్టడం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమేనని రామకోటి విమర్శించారు. ఐటీ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల్లో కూడా ఉద్యోగాల భర్తీని నిలిపివేసి, నిరుద్యోగులను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. “ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి, నిరుద్యోగుల సమస్యలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.”

**- అల్లంపల్లి రామకోటి**

**- ఆందోళనలు ఉధృతం చేస్తాం**

ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ నియామకాలు చేపట్టకపోతే, నిరుద్యోగుల పక్షాన బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని రామకోటి హెచ్చరించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## పరుశరాములు భౌతిక దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తీగల దయాకర్ గౌడ్.



జనగామ (భారత శక్తి )జూన్ 22: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,రామరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు నారగోని పరుశరాములు అనారోగ్యంతో మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ పరామర్శించారు. మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, గ్రామ ఇంచార్జి కుతాటి నర్సింహాలు, మండల నాయకులు బిక్షపతి, శ్రీను, గ్రామ సర్పంచ్ బోయిని మహేందర్, ఆగేష్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు దాసగని భరత్, సోమి రెడ్డి, నర్సింహాలు, బండి నర్సింహ, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డులో ఘనంగా బడిబాట కార్యక్రమం

### విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన కౌన్సిలర్ - బండారు మంగమ్మ వెంకన్న




సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22: పిల్లలందరూ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం జిల్లా కేంద్రం లోని 9వ వార్డులో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని,ఉచితపాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యా సామగ్రి వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ లక్ష్యాలను సాధించాలని కోరారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లడుతూ విద్య ప్రాముఖ్యతను వివరించి, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలురాజేశ్వరి , విద్యార్థినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో "ఈగల్ ఫోర్స్ తెలంగాణ"పై విద్యార్థులకు అవగాహన




రేగొండ, జూన్ 22 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం గోరీకొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈగల్ ఫోర్స్ తెలంగాణ కార్యక్రమం లక్ష్యాలు, ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రభావం గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల సేవనం చట్టరీత్యా నేరమని, వాటి వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక సమస్యలు తలెత్తుతాయని వివరించారు. గంజాయి సేవించడం, మత్తు పదార్థాలను కలిగి ఉండటం, సరఫరా చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, డ్రగ్స్ లేదా గంజాయి సంబంధిత సమాచారం ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 1908 మరియు 8712671111 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కుమారస్వామి, కృష్ణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల గ్రాడ్యుయేట్లకు శుభవార్త

### "అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్" శిక్షణ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం.

నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 22: (భారత శక్తి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో "ట్రైనింగ్ ఇన్ ది అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్" పథకాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం కింద అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.పథకం ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు మూడు సంవత్సరాలపాటు శిక్షణ అందించడంతో పాటు ప్రతి నెల రూ.3,000 స్టైపెండ్ మంజూరు చేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా మొదటి సంవత్సరంలో రూ.50,000 ఒకేసారి ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తాన్ని డిజిటల్ పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నిచర్ మరియు న్యాయవాది దుస్తుల కొనుగోలుకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.అలాగే అభ్యర్థులు చెల్లించిన నమోదు ఫీజును పూర్తిగా తిరిగి చెల్లించే సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.కావున నిర్మల్ జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన లా గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ న్యాయవాద వృత్తిలో మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానంద్ కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి.

### -గురుకుల పాఠశాల, ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 22 (భారతశక్తి): బూర్గంపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలతో పాటు మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, రైతులకు ఎరువుల లభ్యత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాలలోని కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో వంటల తయారీ విధానాన్ని పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారమే ఆహారం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెనూ అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వంటకు వినియోగించాలని, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పాఠశాలలో అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు, హాజరు శాతం, బోధనా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దుకాణంలోని పత్తి విత్తనాల ప్యాకెట్లు, వివిధ రకాల ఎరువులు, పురుగుల మందుల నిల్వలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాములో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను పరిశీలించి నిల్వల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిల్వలు, విక్రయాల వివరాలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కలెక్టర్ వెంట బూర్గంపాడు తహశీల్దార్ కె.ఆర్.కె.వి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో జమ్మల రెడ్డి, ఎంపీవో, కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి ఏవో శంకర్, హౌసింగ్ ఏడి, జిపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక లక్ష్యం 96.26 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించాలి.

### -సింగరేణి బొగ్గు చోరీకి గురైెందంటూ వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదు.
### -ఆధునికసాంకేతిక పరిజ్ఞానంతో బొగ్గు రవాణా జరుగుతుంది.
### -మణుగూరు ఏరియాలో పర్యటనలో స్పష్టతనిచ్చిన డైరెక్టర్ ఎల్.వి సూర్యనారాయణ






మణుగూరు, జూన్ 22 (భారతశక్తి): 2026-27 ఆర్థిక సంవత్సరం నిర్దేశిత వార్షిక లక్ష్యమైన 96.26 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు సమిష్టి కృషి చేసి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ పేర్కొన్నారు. డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కే.సి.హెచ్.పి, పీకేఓసి-2 గనులను సందర్శించారు. క్షేత్రస్థాయిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియను వారు పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటానికి యంత్రాల పని గంటలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అలాగే, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని, నాణ్యమైన బొగ్గుని ఉత్పత్తి చేసి వినియోగదారులకు సరఫరా చేయాలని సూచించారు. వర్షాకాలంలో బొగ్గుఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని, గనుల్లో చేరే వర్షపు నీటిని బయటకు పంపడానికి అవసరమైన అన్ని రకాల పంపులను, మోటార్లను సిద్ధంచేసుకోవాలని సూచించారు. అనంతరం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పికేఓసి-2 డీప్ ప్రాజెక్ట్ ( ప్రకాశం ఖని ఓపెన్ క్యాస్ట్ - 2) అక్షన్ వేయడం జరిగిందని, ఈ ప్రాజెక్ట్ సింగరేణికే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మణుగూరు ఏరియాలో మరో 15 -20 సంవత్సరాల వరకు బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మణుగూరు ఓసీ పొడిగింపు ప్రాజెక్ట్ భూసేకరణ జరుగుతుందని వారు తెలిపారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ఇటీవలకొన్ని మీడియా సంస్థల్లో సింగరేణి బొగ్గు చోరీకి గురైెందంటూ వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదనిస్పష్టం చేశారు. మణుగూరు ఏరియాతో పాటు సంస్థ మొత్తంలో బొగ్గు రవాణా వ్యవస్థ అత్యంత పకడ్బందీగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేస్తోందని వివరించారు. గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుండి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్ గా నమోదవుతుందన్నారు. మొత్తం బొగ్గు రవాణాలో 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా జరుగుతోంది. బొగ్గు కేటాయింపులన్నీ స్వాప్ (ఎస్ఏపి) ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా ముందే డిజిటల్ గా నమోదవుతాయన్నారు. ప్రతి టన్ను బొగ్గు కదలికలను కోల్ నెట్ స్వాప్, ఇతర ఆన్లైన్ సాఫ్ట్ వేర్ ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి బొగ్గు లారీ ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్ వద్ద ఖచ్చితమైన తూకం వేయబడుతుందని, వీటికి తోడు (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) ఆధారిత బూమ్ బ్యారియర్లు, జిపిఎస్/జిఆర్పిఎస్ వాహన ట్రాకింగ్ వ్యవస్థలు జియోఫెన్సింగ్ సాంకేతికత ద్వారా వాహనాలు నిర్దేశిత రూట్ దాటకుండా రియల్ టైమ్ నిరంతరం ట్రాక్ చేయబడతాయిని, రవాణాకు హోలోగ్రామ్ చలానాలను, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పర్యవేక్షణ ద్వారా జరుగుతుందన్నారు. అలాగే రైల్వేమార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్ గా రికార్డ్ చేయబడతాయన్నారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ మణుగూరు ఏరియాలోని గనులు, కేసిహెచ్పీ , రైల్వే సైడింగ్లు, వెయిబ్రిడ్జ్, స్టాక్ యార్డులు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్ల వద్ద అధునాతన సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు చెకోపోస్టులు, సింగరేణి సెక్యూరిటీ, స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ క్షేత్రస్థాయిలో గస్తీ తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక పెట్రోలింగ్ జరుగుతుందన్నారు. ఇలా పకడ్బందీ వ్యవస్థల మధ్య జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి-రవాణా ప్రక్రియలో చోరీ జరగడానికి అవకాశం లేదన్నారు.

## ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి

### - ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించిన
### - విద్యార్థి జన సమితి నాయకులు



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22: ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మ గాని వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో నేడు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వినయ్ గౌడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి అన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాము అనిపదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నవి అని విమర్శించారు. రాష్ట్రంలోని మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం రోజురోజుకూ భారంగా మారుతోంది. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వారిపై కఠిన చర్యలు లేకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం ప్ర ఫీజు నియంత్రణ చర్యలు లేక పేద వర్గాలకు మంచి జరిగే విధంగా నాణ్యమైన విద్య అందించే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. అధిక ఫీజుల భారం వల్ల వేలాది మంది తల్లిదండ్రులు అప్పుల పాలవుతుండగా, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్ మరియు ఇతర పేర్లతో భారీగా డబ్బులు వసూలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నవి రాష్ట్రంలో , అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి నాయకులు దినేష్ నాయక్, ఈశ్వర్ సింగ్,. వరుణ్, హర్ష రింగు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

### - రైతులు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22: జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. దీనివల్ల ఎరువుల సమాన పంపిణీతో పాటు అక్రమ నిల్వలు, మళ్లింపులను అరికట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు.గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం వరి నాట్లు నమోదైన విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది ఇదే సమయానికి 5,571 ఎకరాల్లో వరి నాట్లు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఏడాది ఇదే తేదీ నాటికి 2.37 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 2.64 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేశారని వివరించారు.జిల్లాలో ప్రస్తుతం 0.65 లక్షల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా అవసరమైన మేరకు నిల్వలను నిరంతరం సమకూరుస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి నర్సరీలు పెంచబడిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బస్తాలకు పైగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన నిల్వలను అందుబాటులో ఉంచుతోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

## - మరొకరికి తీవ్ర గాయాలు.



రేగొండ, జూన్ 22 (భారత శక్తి ): గోరి కొత్త మండలం పరిధిలోని జగ్గయ్యపేట శివారులో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ఇద్దరు వ్యక్తులు గోరి కొత్తపల్లి నుండి మోటార్ సైకిల్‌పై రేగొండ వైపు వెళ్తుండగా జగ్గయ్యపేట శివారులోని ఒక మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్ కుమార్, వయస్సు( 21) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు మరియు గాయపడిన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి.

## సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 ( భారత శక్తి )విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం. ఈ. ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న భోంస్లే నారాయణరావు పాటిల్







నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి )ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పాటిల్ సోమవారం భైంసా మండలంలోని చుచుంద్ గ్రామం లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద నూతనంగా నిర్మించిన మూడు ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం నూతన గృహాలను పరిశీలించిన భోంస్లే నారాయణరావు పాటిల్, గృహ యజమానులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్, రామచంద్ర రెడ్డి తదితరులు, గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# అత్యాచార కేసు నిందితుడికి జైలు శిక్ష

## - ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ తెలిపారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి , పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగిందన్నారు. నిందితుడు కొరగట్ల సత్యనారాయణ (45), ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు సీఐలు కె. శివప్రసాద్, ఎం. రాజులు కీలక పాత్ర పోషించారు. కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం.. మనందరి సంకల్పం

## - మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

## - హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పండి

## - డీసీపీ ఎ. భాస్కర్





మంచిర్యాల ప్రతినిధి, జూన్ 22( భారత శక్తి ):అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం రోజున శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాల ద్వారా డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలను చక్కగా వివరించారని అభినందించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అందువల్ల విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే "నో" చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు .విద్యార్థులు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్,ఎస్ఐ సంతోష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీని పటిష్టం చేస్తాం

## - మునావత్ పాండు నాయక్

## -కాంగ్రెస్ ప్రభుత్వంపై గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి ధ్వజం



హైదరాబాద్: జూన్ 22 భారత శక్తి తెలంగాణవ్యాప్తంగా గిరిజనుల సంక్షేమానికి శ్రమిస్తూ, రాష్ట్రావతారంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కృషి చేయనున్నట్లు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మునావత్ పాండు నాయక్ తెలిపాడు. గిరిజనుల హక్కుల రక్షణకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశాడు. ఇటీవల గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితుడైన పాండు నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న గిరిజన తండాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నాడు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులందరికీ చేరవేసేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని వివరించాడు.

### - కాంగ్రెస్ వైఫల్యాలపై విమర్శలు

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమని, బీజేపీ అధికారంలోకి రావడం నూటికి నూరు శాతం నిజమని పాండు నాయక్ ధీమా వ్యక్తం చేశాడు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను ఏమాత్రం నెరవేర్చలేదని విమర్శించాడు. రేవంత్ రెడ్డి పాలనలో ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించాడు.

### -తండాలలో మౌలిక వసతులు కల్పించాలి

రాష్ట్రంలోని అన్ని గిరిజన తండాలలో రోడ్ల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మునావత్ పాండు నాయక్ డిమాండ్ చేశాడు.

# ఎల్బీనగర్‌లో తాగునీటి ఎద్దడిపై బి.జే.పీ సమరభేరి

## - జలమండలి కార్యాలయం ముట్టడి

## - ప్రజల ఇబ్బందులను పట్టించుకోరా అంటూ ఆగ్రహం



ఎల్బీనగర్ జూన్ 22 భారత శక్తి: ఎల్బీనగర్ నియోజకవర్గంలో తీవ్రంగా ఉన్న తాగునీటి కొరతను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు, స్థానిక కాలనీవాసులు సోమవారం హయత్ నగర్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై & సీవరేజ్ బోర్డ్ (జలమండలి) చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి నేతృత్వంలో ఈ ధర్నా నిర్వహించారు.

### - జలమండలి ముట్టడి -- నినాదాల హోరు

నియోజకవర్గంలోని పలు కాలనీల్లో రోజురోజుకూ తాగునీటి సమస్య జటిలమవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని నిరసనకారులు మండిపడ్డారు. ఖాళీ కుండలతో కార్యాలయం ముందుకు చేరుకున్న కాలనీవాసులు, బీజేపీ కార్యకర్తలు జలమండలి అధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### - కాలనీల ఇబ్బందులు పట్టవా?: సామ రంగారెడ్డి

ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ పరిధిలోని అనేక కాలనీల్లో ప్రజలు చుక్క నీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి ముగిసినా నీటి సరఫరాలో ఎలాంటి మెరుగుదల లేకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. లో ప్రెజర్ సమస్య, కలుషిత నీటి సరఫరాపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నీటి ఎద్దడి తీర్చకుంటే ముమ్ముందు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### - ప్రజాప్రతినిధులు, కాలనీవాసుల మద్దతు

ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చి రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, చింతల సురేందర్ యాదవ్, రాక్ టౌన్ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి, నాయకులు పాల్వాయి సంజీవ రెడ్డి, చిలుక రవీందర్ రెడ్డి, గంగాధర్ గౌడ్, శ్రీకాంత్ సహా పెద్ద సంఖ్యలో కాలనీ సంఘాల ప్రతినిధులు, మహిళలు, బీజేపీ శ్రేణులు పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జలమండలి అధికారులకు సమర్పించారు.

# దుబాయ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడిని స్వదేశానికి తీసుకురావాలి.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి): నిర్మల్ జిల్లా తల్వేద గ్రామానికి చెందిన గడ్డాంద సాయన్న దుబాయ్‌లో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో అతడిని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. సమాచారం ప్రకారం, సాయన్న ఏడాదిన్నర క్రితం ఉపాధి కోసం యూఏఈలోని దుబాయ్‌కు వెళ్లి, ఇంజనీరింగ్ కన్స్ట్రక్షన్ అండ్ రికాన్స్ట్రక్షన్ ఎల్ఎల్‌సీ సంస్థలో నిర్మాణ రంగ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం అతడు సోనాపూర్ కార్మికుల శిబిరంలో నివసిస్తున్నాడు. ఇటీవల సాయన్న ఆకస్మికంగా పక్షవాతానికి గురై, తీవ్ర మానసిక ఒత్తిడి మరియు ఆందోళనకు లోనయ్యాడని తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో అతని భార్య కమల, కుమారుడు అజయ్ కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి వెంటనే భారతదేశానికి పంపించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, సంస్థ యాజమాన్యం మరియు సంబంధిత ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరించాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి సాయన్న పరిస్థితిని వివరించి సహాయం కోరారు. అనంతరం కుమారుడు అజయ్, గ్రామస్థులు అనిల్, రఘుతో కలిసి ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ రాష్ట్ర సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి సమస్యను వివరించారు. ఈ విషయంపై స్పందించిన స్వదేశ్ పరికిపండ్ల, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ (ఢిల్లీ) కార్యాలయానికి, అలాగే రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (GAD)కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. సాయన్నను వీలైనంత త్వరగా యూఏఈ నుంచి భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సాయన్న ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

# ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పాటించాలి

**- ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలి**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు**



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి): ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, వీధి ఆహార విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సంబధిత అధికారులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఫుడ్ సేఫ్టీపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆహార పదార్థాల తయారీ జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీలో పనిచేసే సిబ్బందికి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నీటిని క్రమం తప్పకుండా పరీక్షించి, అవి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వీధి ఆహార విక్రయ కేంద్రాలను ప్రతి వారం కనీసం 10 నుండి 15 వరకు తనిఖీ చేసి, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

**- జూన్ 26 న అవగాహన సదస్సు**

**- సూర్యాపేట పట్టణ సీఐ- వెంకటయ్య**




సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక,అక్రమ రవాణా నిరోధక దినోత్సవం జూన్ 26 సందర్భంగా జిల్లా ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ కేంద్రంలో 60 ఫీట్ల రోడ్డులో గల జయ జూనియర్ కళాశాల లో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సిఐ వెంకటయ్య హాజరై డ్రగ్స్ నిర్మూలన, గంజాయి నిర్మూలన పట్ల విద్యార్థులను చైతన్యవంతం చేస్తూ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా మండల పరిధిలో వారం రోజులపాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసే వ్యసనాల బారిన పడకూడదని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా లేదా రవాణా చేసినా చట్టపరంగా ఎదురయ్యే కఠినమైన శిక్షలను హెచ్చరించారు. విద్యార్థులు కేవలం చదువు, క్రీడలపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100, 112 కు, తెలంగాణ రాష్ట్ర ఈగల్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1908 కి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడుతాయని తెలిపారు. మత్తుపదార్థాల రహిత సమాజ స్థాపనకు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేక ఆకర్షణగా లియాంటీ డ్రగ్స్ సోల్జర్‌లి సెల్ఫీ స్టిక్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ స్టిక్ ను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు మేము సైతం మాదాకద్రవ్యాల నిర్మూలన సైనికులుగా ఉంటామని సెల్ఫీ స్టిక్ వద్ద ఫోటోలు దిగి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**- గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం**

**- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి )సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలవాలి

**-సీపీఐ భూ పోరాట కేంద్ర నికి మొహరించిన రెవెన్యూ మున్సిపల్ పోలీస్ అధికారులు సిబ్బంది**

**-సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాట పేదల ఆందోళన**

**-సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి ): మహబూబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక అనంతరం మోడల్ స్కూల్ వద్ద 163 సర్వేనెంబర్ లో సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేదలు చేస్తున్న భూ పోరాట కేంద్రం వద్ద నేడు పెద్ద ఎత్తున రెవెన్యూ మున్సిపాలిటీ మరియు పోలీస్ అధికారులు సిబ్బంది మోహరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలు ఆందోళన చేశారు అధికారులు మా పేదల గుడిసెల జోలికి రావొద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ పేదలు వేసిన గుడిసెలు కూల్చదని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వందలాదిమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని మోసం చేసిందని కిరాయిలు కట్టలేక సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో భూ పోరాటం చేసుకొని గుడిసెలు వేసుకున్న మాకు అన్యాయం చేయొద్దని అన్నారు. అక్కడికి వచ్చిన రెవెన్యూ మున్సిపల్ పోలీస్ అధికారులను అభ్యర్థించారు ముఖ్యంగా జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాలు భూ బకాసురులు రియల్ ఎస్టేట్ దారులు ఆక్రమించుకుంటున్న అధికారులు పట్టించుకోవడంలేదని అవి వారికి కనపడతలేవా అని పేదలు వేసుకున్న గుడిసెలు మాత్రమే అధికారులకు కనబడుతున్నాయని విజయసారథి అన్నారు. ముఖ్యంగా సిపిఐ మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద గుడిసె వాసులకు అండగా నిలవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకొని ఉంటున్నారని వారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఇంటి అద్దెలు కట్టలేక సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం ద్వారా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే ఎంపీ అండగా ఉండి పట్టాలు ఇవ్వాలని అదేవిధంగా ఇంటి స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, 18 వ వార్డు కౌన్సిలర్ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న,, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిళ్ల సాంబలక్ష్మి, మండల కార్యదర్శి తండ సందీప్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రావణ్, మేక వీరన్న,ఎండి ఫాతిమా, భానోత్ లింగ్య నాయక్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కూరాకుల పాల్, మరియు గుడిసె వాసులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

**– ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 22 (భారతశక్తి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టడానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టె నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని, ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువులపై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరించాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

– అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0–5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్ ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షితమైనదని, అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత, కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్య మంచిర్యాల గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు.

# బొగ్గు గనులు ప్రవేట్ పరం చేస్తే మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకం

**-సేవ్ మణుగూరు పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.**

**-కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూనంనేని**

**-రెండురోజుల నిరాహార దీక్షలో భాగంగా మొదటిరోజు దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన కూనంనేని, రాజ్ కుమార్, మిర్యాల రంగయ్య**







మణుగూరు, జూన్ 22 (భారతశక్తి): బొగ్గు గనులు ప్రవేట్ పరం చేసే కుట్ర జరుగుతోందని అలా చేస్తే మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు జోష్యం చెప్పారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో సేవ్ మణుగూరు పోరాటంలో భాగంగా పీకేఓసి– 2 డిప్ సైడ్ బ్లాక్ ని సింగరేణికి కేటాయించాలని, మణుగూరు ఓసిని మూసి వేయకముందే పొడిగింపు అనుమతులు తేవాలని కోరుతూ రెండు రోజుల నిరాహార దీక్షల నిరసన కార్యక్రమాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని అంబేద్కర్ సెంటర్ లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ చట్టం వలన దేశంలోని బొగ్గు గనులన్నీ వేలం పాట ద్వారా ప్రైవేటు వారికి అప్పజెప్పే కుట్ర జరుగుతోందని ఆనాడు రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఎంఎండిఆర్ చట్టానికి మద్దతు తెలిపిందని దాని పర్యవసంగానే తెలంగాణ సింగరేణిలోని బొగ్గు బ్లాకులు వేలానికి వచ్చాయని అన్నారు. తెలంగాణలోని బొగ్గు బ్లాక్ లన్ని సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ప్రాంతంలో పనిచేసే సింగరేణి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మణుగూరులో సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని గుర్తు చేశారు. మణుగూరు చుట్టుప్రక్కల బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్, భద్రాచలం పేపర్ బోర్డ్ తదితర సంస్థలు సింగరేణి బొగ్గుకి అనుబంధంగానే ఏర్పడ్డాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సింగరేణిని రాజకీయానికి వాడుకోవడం సరి కాదని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, బిజెపి పార్టీ సింగరేణి సంస్థ పై చేస్తున్న ప్రచారాన్ని తప్పు పట్టారు. 140 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల సింగరేణి నేడు ఇబ్బందులను ఎదుర్కొంటుందని కేవలం రాజకీయ జోక్యం వలన, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన రూ. 56వేల కోట్లు చెల్లించకపోవడం వలన సింగరేణికి ఈ దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అభివృద్ధికి, సేవ్ మణుగూరు పోరాట కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, ఏఐటీయూసీ కట్టుబడి ఉందన్నారు. పీకేఓసి– 2 డిప్ సైడ్ బ్లాక్, మణుగూరు ఓసి పర్మిషన్లు ఇవ్వాలని లేనిచో సేవ్ మణుగూరు పోరాట కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని యూనియన్ లతో కలిసి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షా శిబిరాన్ని మణుగూరు మెడికల్ షాప్ అసోసియేషన్, తెలుగుదేశం పార్టీ టియుసిఐ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన వారిలో ఏఐటియుసి జనరల్ సెక్రటరీ కామ్రేడ్ కే రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రటరీ మిరియాల రంగయ్య, బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ వై రాంగోపాల్ సిపిఐ పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ సరెడ్డి– పుల్లారెడ్డి, మహిళా రాష్ట్ర నాయకులు మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ టౌన్ పార్టీ సెక్రటరీ దుర్గ్యాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ జి పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, బి సురేందర్ రావు, ఆధర్ల సురేందర్, పిట్ సెక్రటరీలు ఎస్ కుమార్ స్వామి, జి శ్రీనివాసరావు, ఈసం శ్రీనివాస్, రత్నం శివ, బి రవి కుమార్, ఆంతోటి రవికుమార్, సాయి ప్రకాష్ చారి, సతీష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కౌన్సిల్ మెంబర్లు, సేఫ్టీ మైన్స్ కమిటీ మెంబర్లు, డెలిగేట్లు సానుభూతిపరులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చెరువు మట్టిని అక్రమంగా తరలించి రాత్రికి రాత్రి మట్టికట్ట నిర్మాణం

**రామడుగు(భారత శక్తి):** రామడుగు మండలం శ్రీరాములపల్లి గ్రామంలోని కాసారపుకుంట వద్ద నిర్మించినటువంటి గేట్ వాల్ నీటిని వదిలే గ్రావిటీ డ్రైనేజీని రైతు కూల్చడమే కాకుండా కట్టను ర్యాంప్ చేసి డ్రైనేజీకి అడ్డుగా చెరువు మట్టిని అక్రమంగా రాత్రికి రాత్రి తరలించి మూడు మీటర్ల ఎత్తుతో సుమారు 50 గజాల పొడవుతో మట్టి కట్ట నిర్మించడంతో కింద ఉన్న పొలాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువు కట్ట వెంబడి ఎడ్లబండ్ల బాట కలదని అట్టి బండ్ల బాట కనుమరుగైందని ఇట్టి బాటగుండా మత్తడి నీరు రైతుల పొలాల వెంబడి వెళ్లేదని నీటిని పొలాల వెంబడి వెళ్లకుండా కందకం త్రవ్వి మూడు మీటర్ల మట్టి దిబ్బలు పోయడం వల్ల అధిక వర్షాలు కురిస్తే ఆ వర్షపు నీటి ఒత్తిడి పెరిగే దిగువనున్న రైతుల పొలాలలో ఇసుక మట్టి మెటల్ ఏర్పడి పంట నష్టం కలుగుతుందని గ్రామ రైతులు తెలిపారు.ఇట్టి విషయంపై ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లయ్యను వివరణ కోరగా గతంలో ఇరువర్గాలను పిలిచి హెచ్చరించడం జరిగిందని మోకా విచారణ జరిపి రైతులకు నష్టం కలగకుండా గతంలో ఉన్నటువంటి తూమ్ గేట్ వాల్ యొక్క డ్రైనేజీని పునరుద్ధించడం తోపాటు శాశ్వత పరిష్కారం చూపుతామని వారు తెలిపారు.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రైతులకు నష్టం కలగకుండా పరిష్కారం చూపాలని రైతులు పత్రిక ముఖంగా అధికారులను వేడుకొంటున్నారు.

# పల్లె వీక్షణంలో పాల్గొన్న కలెక్టర్

**నెల్లూరు(భారత శక్తి)** నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పిడతాపోలూరులో నిర్వహించిన పల్లెవీక్షణం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడ్డిపాలెంలో ఉపాధి హామీ పనులు, జల్‌జీవన్ మిషన్ తాగునీటి ట్యాంకులను తనిఖీ చేశారు. పిడతాపోలూరులో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ప్రజలతో నేరుగా మాట్లాడిన ఆయన.. పలువురి సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. తక్షణ పరిష్కారానికి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

# జీజీహెచ్ కి ఐఓఎల్ సీఎస్ ఆర్ నిధులు

**- హాజరయిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం(భారత శక్తి)** జిల్లాలోనే ఉత్తమ సేవలు అందించే ఆసుపత్రిగా జి.జి.హెచ్ శ్రీకాకుళం ను తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.బలగలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అక్షర సమావేశ మందిరంలో ఇండియన్ ఆయిల్ కార్పరేషన్ లిమిటెడ్ నుండి 4 కోట్ల ముప్పై లక్షల సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్న వైద్య పరికరాలకు సంబంధించి మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్ ను జి.జి.హెచ్ అధికారులతో కలసి మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడారు. 700 కి పైగా ఇన్ పేషంట్.. 1500కి పైగా అవుట్ పేషంట్ సామర్థ్యంతో నిత్యం రోగులకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి తోనే జిల్లా అభివృద్ధి ముడిపడి ఉందని తాను విశ్వసిస్తానని.. సరైన వైద్య పరికరాలు లేకుండా సరైన వైద్యం వీలు కాదని రామ్మోహన్ నాయుడు అన్నారు. గత ఏడాది ఇదే సమయంలో జీజీహెచ్ రివ్యూ సమావేశంలో ఆసుపత్రికి ఏవేవి పరికరాలు అవసరమో.. ఇక్కడి వైద్య బృందాన్ని అడిగి నివేదిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం అనేక కార్పోరేట్ కంపెనీలకు సంప్రదించి వారి సి.ఎస్.ఆర్ నిధులు ఇక్కడ వెచ్చించేలా తనవంతు కృషి చేశానని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# పవన్‌కు కులం ఆపాదించడం సరి కాదు

**- జనసేన నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్ (భారత శక్తి)** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కులాన్ని ఆపాదించటం సరైంది కాదని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బాలినేని మాట్లాడుతూ కాపులను డివైడ్ చేయాలని వైసీపీ ప్రయత్నిస్తుంది. 100శాతం కాపులు పవన్ కళ్యాణ్ తో ఉన్నారు. ఎలాగైనా కూటమి నుంచి పవన్ బయటకు తీసుకురావాలని వైసీపీ కుట్ర చేస్తుంది పవన్ కళ్యాణ్ ను కాపుల నుంచి దూరం? చేయటం ఎవరి తరం కాదని అన్నారు.

సాయికృష్ణ ఎపిసోడ్ పై.. సిట్ నిజ నిజాలు తేల్చుతుంది. సీఐ నాగరాజును కాపాడాల్సిన పని కూటమి ప్రభుత్వానికి లేదు. లాకప్ డెత్ కు ఎవరూ అంగీకరించరు. రాష్ట్రంలో ఏది జరిగినా పవన్ కళ్యాణ్ కు ఆపాదించటం సరైంది కాదు. వైసీపీ నేతలు.. నవీన్ రెడ్డి అనే వ్యక్తి ఫోటో చూపించి సాయి కృష్ణగా చెప్తున్నారు. రెడ్డి అయిన నవీన్ రెడ్డి కుటుంబాన్ని ఎందుకు జగన్ రెడ్డి ఎందుకు పరామర్శించలేదు సాయికృష్ణ చనిపోయాడో లేదో కూడా నిర్ధారణ లేదు. వైసీపీ కాపు నేతలను కాపులు నమ్మే పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలుగా గెలిపించింది ఇంట్లో కూర్చోవడానికి కాదని వైసీపీ గుర్తుంచుకోవాలి. అసెంబ్లీలో సైతం కుటుంబ సభ్యుల గురించి మాట్లాడే సంస్కృత వైసీపీనే ప్రారంభించింది, చంద్రబాబు సతీమణి గురించి అసెంబ్లీలో మాట్లాడటం చాలా తప్పు. సీఎం హోదాలో జగన్ ఆనాడే ఖండించి ఉంటే జగన్ పరిస్థితి మరోలా ఉండేది. ఇలాంటి రాజకీయాల్లో ఎందుకున్నామా అని అనిపిస్తుందని వ్యాఖ్యానించారు.

# చక్రాయపేట అక్రమ ఇసుక క్వారీ వద్దకు వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**కడప(భారత శక్తి)** కడప జిల్లా చక్రాయపేట అక్రమ క్వారీ కుంటలో పడి జయంత్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి మృతి చెందిన ఘటనపై ఎంపి అవినాష్ రెడ్డి స్పందించారు.

సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లారు. చిన్నారుల మృతదేహాలకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు. రాత్రి నుండి ఘటనాస్థలిలోనే చిన్నారుల మృతదేహాలతో తల్లిదండ్రులు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు.

# డీటీవోను ఢీకొన్న టిప్పర్.. అక్కడికక్కడే మృతి

**భూపాలపల్లి** వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారిని బొగ్గు టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో జిల్లా రవాణ శాఖాధికారి వెంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనలో మృతదేహం నుజ్జు నుజ్జైయింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట పరకాల ? భూపాలపల్లి హైవేపై ఘటన జరిగింది. మృతుడు వెంక్న 15 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీ మీద వచ్చారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభం

**- జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్**

**(భారత శక్తి)**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానుందని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్) మీడియాకు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేటర్లు, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.ప్రజలు అందించే ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా నింపి ఒక ప్రతిని బీఎల్ఓలకు తిరిగి అందజేయాలని, మరో ప్రతిని తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు.

ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో సహకరించాలని కోరారు.అలాగే, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామని సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్) తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఊపిరి ఉన్నంతవరకు భాజపాలోనే: రామక్రిష్ణ

**సికింద్రాబాద్..(భారత శక్తి)** పార్టీ నుండి బహిష్కరించిన అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయని కంటోన్మెంట్ భాజపా బహిష్కృత నేత రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ అభివృద్ధికి సహకరించడం లేదని కంటోన్మెంట్ టి పి టి బకాయిల విషయంలో హైకోర్టును ఆశ్రయించినట్లు మాజీ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బోర్డు కు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన టిపిటి బకాయిల చెల్లింపులపై గతంలోనే హైకోర్టును ఆశ్రయించగా ఇటీవల హైకోర్టు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కి ఫార్మ్ వన్ జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. 2023లో నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే హైకోర్టును ఆశ్రయించగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి 80 కోట్ల రూపాయల బకాయిలను రాబట్టి కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించినట్లు పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రజల నుండి పన్నుల ద్వారా వచ్చే డబ్బులను రాష్ట్ర ఖజానాతో పాటు కంటోన్మెంట్ బోర్డు కు ఏకకాలంలో మళ్లిస్తే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో మడ్ ఫోర్డ్ గుడిసెలలో నివాసం ఉంటున్న పేద ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూ బదలాయింపు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో రక్షణ శాఖ భూముల పరిహారం ద్వారా సమకూరిన 303 కోట్ల రూపాయలు తీసుకువచ్చి కంటోన్మెంట్ ఖాతాలో జమ చేసిన ఘనత కేంద్ర మంత్రులకే దక్కుతుందని అన్నారు.

# వాసిలి లో మంత్రి ఆనం రైతులతో ముఖాముఖీ

**నెల్లూరు(భారత శక్తి)** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సంక్షేమానికి అగ్రతాంబూలం వేస్తూ ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడడం లేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం వాసిలి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మంత్రి ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, పల్నాడు జిల్లా లింగంగుంట్ల నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125 కోట్లను జమ చేసిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, లింగంగుంట్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాలను ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక సవాళ్లు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు ప్రతి ఏడాది రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ రెండో ఏడాది తొలి విడత నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం"×కు నిదర్శనమని పేర్కొన్న మంత్రి, ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని మరింత బలపరుస్తూ రాబోయే మూడేళ్లలో సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ లపై కృశాంక్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ సీనియర్ నేతలు

**(భారత శక్తి)**బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మైనంపల్లి హనుమంతరావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ లపై కృశాంక్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్నాం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక నోరు పారేసుకుంటున్నారని అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులను ఎదుర్కొనే దమ్ము లేక వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాలలోనే మైనంపల్లి హనుమంతరావుకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన పట్ల అసభ్యకర రీతిలో మాట్లాడడం సరికాదని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై అసత్య ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు అసత్య ప్రచారాలు మానుకోకపోతే క్రిశాంక్ కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**కుత్బుల్లాపూర్:(భారత శక్తి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కే.పీ. వివేకానంద ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, అభివృద్ధిని విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వారు హితవు పలికారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపైన గాని, కాంగ్రెస్ పార్టీ నాయకులపైన గాని ఇలాంటి అవాకులు చవాకులు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఏ.ఆర్. సాదు యాదవ్, యువజన నాయకులు పృథ్వి, శ్రీశైలం యాదవ్, గజేంద్ర , అమర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా ప్రారంభమైన రైతన్న మీకోసం కార్యక్రమం

**- ఈనెల 22 నుంచి 27 వరకు ఇంటింటా ప్రచార కార్యక్రమం.**

**- ఏడిఏ మోహన్ విజయ్ కుమార్.**



**తుగ్గలి(భారత శక్తి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 22 నుండి 27వ తేదీ వరకు రైతన్న మీకోసం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడిఏ మోహన్ విజయ్ కుమార్,మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు. సోమవారం రోజున మండల పరిధిలోని గల జొన్నగిరి,ఉప్పర్లపల్లె,రాంపల్లి గ్రామాలలో రైతన్న మీకోసం కరపత్రాలను పంపిణీ చేసి రైతన్న మీకోసం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్ నినో పరిస్థితులకు ముందస్తు చర్యలు,ఎల్ నినో ప్రభావ నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.అదేవిధంగా ఎరువుల ఆన్లైన్ పంపిణీ వ్యవస్థ గురించి మరియు సమతుల్య ఎరువుల వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు.పంటల ఆదాయ వృద్ధి మరియు స్థిరమైన లాభాల కోసం పంటల సాగుకు ప్రోత్సహించడం వంటి వాటిపై వారు రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సూచనలను మరియు సలహాల మేరకు రైతులు పంటలను సాగు చేసుకోవాలని ఏడిఏ మోహన్ విజయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజేశ్వరి, ఉప్పర్లపల్లె సొసైటీ అధ్యక్షులు అప్పా వేణుగోపాల్ రాయల్,నీలా మనోహర్, విద్యా కమిటీ చైర్మన్ కంబగిరి, వ్యవసాయ శాఖ అధికారులు,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సిఐ నాగరాజుకి మద్దతుగా

# కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ

**- ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, స్థానిక మహిళలు**

**విజయవాడ (భారత శక్తి)**కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ నాగరాజు కృష్ణలంక పిఎస్ లో చార్జి తీసుకున్నప్పటి నుండి రౌడీయిజం మీద ఉక్కు పాదం మోపారు. ముఖ్యంగా కృష్ణలంక ఏరియాలో గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టారని అన్నారు.ఆడపిల్లలపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వాడి కి తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చి నేరలను అరికట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రిపూట పది తర్వాత ఆడవాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడే వారు. ఇప్పుడు నాగరాజును ఇక్కడి నుండి తప్పిస్తే మళ్లీ వారి ఆగడాలు ఎక్కువ అవుతాయి. గతంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ చేసినప్పుడు దానిని సమర్థించిన పెద్దలు దీన్ని ఎందుకు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# నష్టాల బాటలో ఎల్ ఐసీ

**ముంబై (భారత శక్తి)**స్టాక్ మార్కెట్ అంటేనే ఒడుదొడుకులు ఉంటాయ. విపరీతమైన రిస్క్ ఉంటుంది. ఏ కారణాలతో సూచీలు రాణిస్తాయో, ఏ కారణాలతో పడతాయో, ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు ఎందుకు పడుతుందో ముందుగానే ఊహించడం కాస్త కష్టమే. ఎన్నో అంశాలు ఇక్కడ ముడిపడి ఉంటాయి. ఈ ఏడాది మార్చి నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు ఇందుకు కారణం. క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరగడంతో స్టాక్ మార్కెట్లలో కూడా నష్టాలు వచ్చాయి. విదేశీ పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో ఆ మధ్య భారత మార్కెట్ సూచీలు భారీగా తగ్గాయి.ఇటీవల అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా సూచీలు పుంజుకున్నాయి. కిందటి వారంలో జూన్ 15-19 మధ్య 5 ట్రేడింగ్ సెషన్లలో బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ 1275 పాయింట్లు లేదా 1.68 శాతం ఎగబాకింది. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. టాప్- 10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ వాల్యుయేషన్ రూ. 2.15 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. ఆయా కంపెనీల మార్కెట్ విలువనే మదుపరుల సంపదగా పరిగణిస్తుంటారు. దీంతో ఈ మేర ఇన్వెస్టర్లకు కూడా భారీగా లాభాలు వచ్చాయని చెప్పొచ్చు.ఇక గత వారంలో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ 5 రోజుల వ్యవధిలో రూ. 52,432.67 కోట్లు పెరిగి రూ. 11.62 లక్షల కోట్లకు చేరుకుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఒఎఅ) మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ. 51,675.23 కోట్లు పెరగడంతో ఇప్పుడు రూ. 5.56 లక్షల కోట్లుగా ఉంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 26,553 కోట్లు పెరగడంతో ప్రస్తుతం రూ. 5.98 లక్షల కోట్లకు చేరుకుంది.మార్కెట్ విలువ పరంగా భారత్‌లో అతిపెద్ద కంపెనీగా ఉన్నటువంటి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం- క్యాప్ గత వారం రూ. 22,464 కోట్లు పెరగడంతో రూ. 17.71 లక్షల కోట్లుగా ఉంది. లార్సెన్ అండ్ టుబ్రో ఎం- క్యాప్ రూ. 21,929 కోట్లు పెరిగి రూ. 5.79 లక్షల కోట్లుగా ఉంది. ఎస్బీఐ మార్కెట్ విలువ 5 రోజుల్లో రూ. 16 వేల కోట్లకుపైగా పెరగడంతో ప్రస్తుతం ఎం క్యాప్ రూ. 9.55 లక్షల కోట్లకు చేరుకుంది.అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ ఊఆఈఊఅ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11,948 కోట్లు పెరిగి రూ. 12.01 లక్షల కోట్ల వద్ద ఉంది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 6661 కోట్లు పెరిగి రూ. 5.15 లక్షల కోట్లుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం క్యాప్ గత వారంలో రూ. 4724 కోట్లు పెరిగి రూ. 9.66 లక్షల కోట్ల వద్ద ఉంది. ఇదిలా ఉండగా అతిపెద్ద భారత ఐటీ కంపెనీ టీసీఎస్ మార్కెట్ విలువ కిందటి వారం రూ. 12,699 కోట్లు తగ్గి రూ. 7.69 లక్షల కోట్లుగా నమోదైంది.

# మూడు సముద్రాలపై భారత్ పట్టు

**ముంబై,(భారత శక్తి)** ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తూ ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎన్ఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకా దళంలో ఐఎన్ఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది. దీనిని దేశ అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. నీటి అడుగున ఇది మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. దూర ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. అటానమస్ అండర్ వాటర్ వాహకాలు ఇందులో ప్రత్యేకంగా ఉన్నాయి. మనుషులు లేకుండానే దీని ద్వారా సముద్ర అంతర్భాగంలో పరిశోధనలు సులభంగా చేయవచ్చుదునగిరి, సంషోదక్ వంటి వాటితో పోల్చి చూస్తే అగ్రయ్ అత్యంత చిన్న నౌక.. ఇది పూర్తిగా జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక. ఇది శత్రు జలాంతర్గములను గుర్తిస్తూ ఉంటుంది. వాటిని నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. తేలికపాటి టార్పెడో లేదా రాకెట్ల ద్వారా వాటిని ఇది ధ్వంసం చేస్తూ ఉంటుంది. ఇందులో షాలో వాటర్ సోనర్ వ్యవస్థ ఉంటుంది. ఇది అత్యంత కఠినమైన జలాల్లో కూడా పనిచేస్తూ ఉంటుంది.

# ధర్మస్థలి వివాదం వెనుక ప్రకాష్ రాజ్

**బెంగళూరు,(భారత శక్తి)** మధ్య కర్ణాటక రాష్ట్రంలో ధర్మస్థల వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అది కాస్త దేశంలోనే సంచలనం కలిగించింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్ లోకి ప్రకాష్ రాజ్ ప్రవేశించారు. తీవ్రాతీతీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.. అక్కడితోనే ఆగిపోలేదు.. హిందువుల మీద.. హిందూ ధర్మం మీద దారుణంగా మాట్లాడారు. జస్ట్ ఆస్కింగ్ పేరుతో ధర్మస్థల అంశం మీద ఏదో ఒక విషయాన్ని ప్రకాష్ రాజ్ తెర పైకి తీసుకొచ్చేవారు.అప్పట్లో ధర్మస్థల వివాదానికి సంబంధించి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నప్పటికీ.. ప్రకాష్ రాజ్ ఊరుకునేవారు కాదు. దీనికి తోడు ఆ ఆలయంలో పనిచేసిన చిన్నయ్య మరింత వివాదాన్ని కలిగించే విషయాలను చెప్పడంతో ప్రకాష్ రాజ్ ఇంకా ఎక్కువ రెచ్చిపోయేవారు.

దీంతో ధర్మస్థల ఆలయ ప్రాశస్త్యం చాలావరకు దెబ్బతిన్నది. దీనికి తోడు కొన్ని మీడియా సంస్థలు కావాలని నెగిటివ్ స్టోరీస్ పబ్లిష్ చేసేవి.ధర్మస్థల వివాదం మీద ఇప్పుడు ఒక క్లారిటీ రావడంతో.. ప్రకాష్ రాజ్ అసలు రంగు బయటపడుతోంది. దీనికి తోడు చిన్నయ్య కూడా కీలక విషయాలను చెప్పడంతో.. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యవస్థీకృత ముఠా ఉన్నట్టు అందరికీ అర్థమవుతోంది. దీని వెనక భారీగానే డబ్బులు చేతులు మారాయని సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఇటీవల ప్రకాష్ రాజ్ బెంగళూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే మధ్యలో వదిలి వెళ్ళిపోయారు.ఇప్పుడిక ప్రకాష్ రాజ్ వ్యవహారం మరో మలుపుతీసుకుంది.

ఆయన మీద నాన్ బెయిలబుల్ వారంటీ నమోదయింది. ఆయన ఏకంగా నాలుగు రాష్ట్రాలలో ఓటర్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారంటూ కేసు దాఖలయింది. 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాష్ రాజ్ కు వారెంట్ జారీ చేసింది. ప్రకాష్ రాజ్ పలచోట్ల ఓట్ హక్కు కలిగి ఉన్నారంటూ దిలీప్ కుమార్ అనే లాయర్ 2019లో బెంగళూరు నగరంలో హలసూరు గేటు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆయన బిబి ఎంపీ.. కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో కోర్టులో పిటిషన్ వేశారు. ప్రకాష్ రాజ్ తమిళనాడు.. ఆంధ్ర ప్రదేశ్.. కర్ణాటక.. తెలంగాణ రాష్ట్రాలలో ఓటు హక్కులు కలిగి ఉన్నారని దిలీప్ కుమార్ ఆరోపిస్తున్నారు. అయితే ఈ కేసు విచారణకు ప్రకాష్ రాజ్ హాజరు కాకపోవడంతో కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం విశేషం.

## సూపర్ లగ్జరీ బస్సు ప్రమాద ఘటనపై
# మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిగ్భ్రాంతి

**– మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి(భారత శక్తి)** తిరుపతి కడప సూపర్ లగ్జరీ బస్సు ప్రమాద ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. – ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి పునీత్ సాయి, విద్యార్థిని యశ్విత కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్?చారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా తీసారు. తీవ్రగాయాలైన వారికి మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు, బస్సు?లారీ వివరాలపై ఫోన్లో అధికారులతో మంత్రి ఆరా తీసారు. – భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సంతమాగులూరు మండలంలో
# ఘోర రోడ్డు ప్రమాదం

**– ఇద్దరు మృతి, 7 మందికి తీవ్ర గాయాలు**

**సంతమాగులూరు(భారత శక్తి)** కామేపల్లి?వెల్లలచెరువు మధ్య ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న ఆటో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శావల్యపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న మరో 7 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## బేగంపేటలో మల్కాజిగిరి సిపి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటన

**బేగంపేట(భారత శక్తి)** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిని అంచనా వేయడానికి మరియు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను సమీక్షించడానికి మల్కాజిగిరి సిపి సుమతి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తో కలిసి బేగంపేట చికోటీ గార్డెన్ వద్దకు చేరుకుని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ట్రాఫిక్ అంతరాయాలను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలను వారు దగ్గరుండి సమీక్షించారు. వర్షాకాలం కావున పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని, అవసరంలో ఉన్న పౌరులకు సహాయం చేయాలని, పౌర, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.పోలీసులకు సహకరించడానికి స్థానికులు స్వచ్ఛందముగ ముందుకు వచ్చి తగిన సహకారం అందించాలనీ ఆమె స్థానికులను కోరారు.

## వారాసిగూడలో పోలీసులు
# సైబర్ నేరాల అవగాహనా కార్యక్రమం

**వానాసిగూడ(భారత శక్తి)** సోమవారం నాడు వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు మరియు సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన అటువంటి జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా చిలకలుగూడ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి , వారాసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్లకు కానీ, వీడియో కాల్స్ కు కానీ ఎవరు స్పందించవద్దు, వారికి డబ్బులు పంపవద్దని సూచించారు. తమ తమత రాదు, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని అన్నారు. నిర్ధారించుకున్న తర్వాతనే మీరు అవతలి వ్యక్తులకు డబ్బులు పంపించాలి. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే గోల్డెన్ అవర్లో 1930 కు కాల్ చేసి సమాచారం అందజేస్తే జీరో ఎఫైర్ నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్ కి పంపుతామని అన్నాడు. తద్వారా ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. డబ్బులు ఎవరైనా కోల్పోతే కోర్టు నిబంధనల మేరకు డబ్బులను తిరిగి ఇప్పించడానికి వీలవుతుంది, కనుక ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు సైబర్ నేరాలు జరగకుండా అవగాహన కల్పించాలని అన్నారు.

## తిరుమలగిరిలో ఘనంగా
# సెయింట్ ఆంథోని ఫీస్ట్ వేడుక

**ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

**(భారత శక్తి)**తిరుమలగిరి 108 బజార్లోని సెయింట్ ఆంథోని చర్చిలో ఆదివారం నిర్వహించిన ఫీస్ట్ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఫీస్ట్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ "సెయింట్ ఆంథోని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో, సోదరభావంతో జీవించాలని, మతసామరస్యానికి కంటోన్మెంట్ ఎప్పుడూ ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళీ ముదిరాజ్, చర్చ్ పాస్టర్లు, చర్చ్ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం

**– భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి**



**చిత్తూరు (భారత శక్తి)** భార్య అనారోగ్యంతో తల్లడిల్లిన ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తండ్రి భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఏటీఎం పిన్ రాసిపెట్టి అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని వినతి చేసాడు. చిత్తూరు జిల్లా దిగుమసపల్లె పంచాయతీలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో భార్య నిర్మల(25), కొడుకు రాజేష్(13),కూతురు శ్రీవిద్య(11)లతో కలిసి దామోదరం(30) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్తో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమించడంతో, భార్యా పిల్లలకు విషం తాగించి అనంతరం తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్లో ఏటీఎం పిన్ నంబర్, ఫోన్ పే నంబర్ రాసి, అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని విజ్ఞప్తి చేసాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ కాలేజీల్లో అన్నీ లోపాలే

**గుంటూరు,(భారత శక్తి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు చైర్మన్గా వ్యవహరిస్తున్న కృష్ణ చైతన్య విద్యాసంస్థల పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ విద్యాసంస్థలకు చెందిన ఆరు జూనియర్ కళాశాలలపై గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన విద్యాశాఖ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి దాటే వరకు సాగాయి.అధికారుల సుదీర్ఘ తనిఖీల్లో సదరు విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా పాటించడం లేదనేగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కనీస స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ అనుమతులు గడువు ముగిసినా నూతనీకరించకపోవడం, సామర్థ్యానికి మించి ఒకే గదిలో విద్యార్థులను గొర్రెల మందలా ఉంచడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, ల్యాబ్లలో కెమికల్స్ భద్రత సరిగా లేకపోవడం, విద్యార్థులకు కనీస తాగునీరు, పరిశుభ్రమైన శానిటేషన్ వసతులు కూడా కల్పించకపోవడాన్ని కూడా గుర్తించారు.రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పొరుగు జిల్లా అయిన గుంటూరుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రత్యేక టాస్క్ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. కాలేజీ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, హాస్టల్ అనుమతులకు సంబంధించిన ప్రతీ పత్రాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్ధరాత్రి దాటే వరకు అటెండెన్స్ సాఫ్ట్వేర్ డేటాను, అడ్మిషన్ల రికార్డులను క్రాస్ వెరిఫై చేసిన అధికారులు.. అనుమతులు లేని అదనపు సెక్షన్లను నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆయా ఫైళ్లను సీజ్ చేశారు.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చైర్మన్గా ఉన్న విద్యాసంస్థలు కావడంతో, ఐదేళ్ల హయాంలో ఇక్కడి లోపాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రూల్స్ ఉల్లంఘించే కార్పొరేట్ కాలేజీలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ తనిఖీలపై గుంటూరు, నెల్లూరు అధికారులు తుది నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్కు సమర్పించనున్నారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కృష్ణ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

**అనంతపురం(భారత శక్తి)** సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు.గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద ముస్లింలు పెళ్లిళ్లు చేసుకునే ప్రభుత్వ షాదీ మహల్కు రెండున్నరేళ్లుగా ఎందుకు తాళాలు వేశారు? వారు చేసిన పాపం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు, కదిరి కాలేజీ సర్కిల్లో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లింల సమాధులను సైతం తొలగించి, ఆ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించడం వాస్తవం కాదా అంటూ నిలదీశారు.కదిరిలో తాను అడిగిన సూటి ప్రశ్నలకు ఎమ్మెల్యే ప్రసాద్ నేరుగా సమాధానం చెప్పాలని, తన అనుచరులను ప్రయోగించి పారిపోవద్దని ప్రవీణ్ రెడ్డి సవాల్ విసిరారు. వారిని బలి చేయవద్దు. రేపు ప్రభుత్వం మారితే నీకంటే ముందు వాళ్లే కేసుల్లో ఇరుక్కుంటారు, అప్పుడు వారి పరిస్థితి ఏమిటో ఆలోచించు అని హెచ్చరించారు. మనం ఇద్దరం నేరుగా కూర్చుని కదిరి అభివృద్ధిపై, కబ్జాలపై మాట్లాడుకుందాం. ఏ చర్చకైనా నేను సిద్ధం అంటూ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ప్రస్తుతం కదిరిలో వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. భూకబ్జాలు, మద్యం మాఫియా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల వంటి కీలకమైన ఆరోపణలు తెరపైకి రావడంతో స్థానిక రాజకీయాలు వేడెక్కాయి. ప్రవీణ్ రెడ్డి విసిరిన ఈ సవాళ్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , టీడీపీ శ్రేణులు ఏ విధంగా స్పందిస్తాయో, ఈ బహిరంగ చర్చ సవాల్ ఎక్కడి వరకు దారితీస్తుందో అని కదిరి ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ముద్రగడకు భరోసా ఎవరు

**కాకినాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన సీనియర్ కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముద్రగడ అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్లోని కార్పొరేట్ ఆసుపత్రి యశోదకు తరలించారు. అయితే, అక్కడ వైద్య ఖర్చులు ఊహించని స్థాయిలో ఉండటంతో.. ఆ బిల్లులు భరించలేక రాత్రికి రాత్రే ఆయనను సమీపంలోని ఒక చిన్న ప్రైవేట్ ఆస్పత్రికి మార్చడం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. ముద్రగడను కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇప్పుడు ఆయన వైద్యానికి కనీస భరోసా ఇవ్వకపోవడంపై ముద్రగడ అనుచరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.గత సార్వత్రిక ఎన్నికల నుంచి వైసీపీకి కాపు అస్త్రంగా ముద్రగడ ఉపయోగపడ్డారు. ఆయనకు ఇష్టం లేకపోయినా, వయసు సహకరించకపోయినా.. ఆయన కుమారుడికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తామంటూ, భవిష్యత్తు బాగుంటుందంటూ వైసీపీ అగ్రనాయకత్వం ముద్రగడను ఎమోషనల్ బ్లాక్మెయిల్ చేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడిని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ను టార్గెట్ చేస్తూ ముద్రగడతో ఘాటైన లేఖలు రాయించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం, ఆఖరికి అనారోగ్యంతో ఉన్నా బలవంతంగా వీడియో బైట్స్ విడుదల చేయించడం వెనుక వైసీపీ వ్యూహకర్తలే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా సాయికృష్ణ ఉదంతంలో ఆయనతో ఓ లేఖ రాయించేందుకు ప్రయత్నించారు. కానీ ఈలోపే ఆయన ఆసుపత్రి పాలవ్వడంతో కథ అడ్డం తిరిగింది.హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ వైద్య ఖర్చుల విషయంలో సాయం కోరేందుకు ఆయన కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు తాడేపల్లి ప్యాలెస్ను, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించేందుకు గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని టాక్. అసలు ఎవరూ పట్టించుకోలేదు. కార్పొరేట్ ఆసుపత్రి భారీ ఖర్చులకు సంబంధించిన ఆర్థిక భరోసా లేదా సాయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం లాంటి ఒక సీనియర్ లీడర్ను ఆపద సమయంలో వైసీపీ ఒంటరిని చేసిందనే వార్త గోదావరి జిల్లాల్లోని కాపు శ్రేణులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. అవసరమైనప్పుడు పవన్ కల్యాణ్పైకి ఉసిగొల్పి.. పంతానికి పోయి పేరు మార్చుకునే దాకా ముద్రగడను వాడుకుని, ఇప్పుడు వైద్యం చేయించుకునే పరిస్థితి వస్తే చేతులెత్తేస్తారా అంటూ క్షేత్రస్థాయి అనుచరులు మండిపడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్లను తిట్టడానికే ముద్రగడ పనికొచ్చారా.. ఆయన ప్రాణాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.ఓ వైపు ముద్రగడ ఆరోగ్యపరిస్థితి బాగోలేక ఆస్పత్రిలో ఉంటే కాపు నాయకుల పేరుతో తోట త్రిమూర్తులు వంటి వారు హడావుడి ప్రారంభించారు. రాజకీయాల్లో యూజ్ అండ్ త్రో జగన్కు కొత్తేమీ కాకపోయినా.. ముద్రగడ లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల నేత విషయంలో ప్రదర్శిస్తున్న వైఖరి ఆ పార్టీ నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రత్యర్థులపై బురద చల్లడానికి ఒక సీనియర్ నేత ఇమేజ్ను ఎమోషనల్గా వాడుకుని, ఆయన ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి బెడ్పై ఉంటే ఆర్థికంగా ఆదుకోకపోవడం ముద్రగడ అనుచరులకే కాకుండా తటస్థులకు కూడా మింగుడుపడటం లేదు

# అనంతపురం టూ అమరావతి...

**అనంతపురం(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వేగంగా చేరుకునేలా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైవేలు, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వేగంగా చేరుకునేలా ప్లాన్ చేశారు. ఈ రోడ్లకు సంబంధించిన పనులు పూర్తిచేస్తే ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. రాజధాని అమరావతికి అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ ఉండేలా ప్లాన్ చేసింది. కేంద్రం సహకారంతో కొత్తగా రోడ్లకు సంబంధించి ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వెళ్లడానికి హైవేలు, రోడ్లకు సంబంధించిన ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు నేషనల్ హైవే-544జీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 624 కి.మీ.ల గ్రీన్ఫీల్డ్ కారిడార్ విజయవాడ నుంచి బెంగళూరుతో కనెక్ట్ చేస్తోంది. విజయవా నుంచి నేషనల్ హైవే 16 మీదుగా వచ్చి ప్రకాశం జిల్లా ముప్పవరం, అద్దంకి మీదుగా హైవే వెళుతుంది. ఈ హైవే పూర్తి చేస్తే 110 కి.మీ.లు దూరం తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. ఈ హైవే ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా వెళుతుంది. అలాగే అనంతపురం జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు రోడ్ల అనుసంధానంపై ఫోకస్ పెట్టారు.మలకవేముల క్రాస్ దగ్గర జంక్షన్ ఏర్పాటు చేసి బీకేవీ (బెంగళూరు, కదిరి, విజయవాడ) ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా జిల్లా నుంచి అమరావతికి కేవలం 5 గంటల్లో చేరేలా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 4 లైన్ హైవేను రూ. 707 కోట్లతో నిర్మించనున్నారు. అనంతపురం, బెంగళూరులను అనుసంధానం చేసే రోడ్లను మలకవేముల క్రాస్ దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి నాలుగు లైన్ల రోడ్డు కూడా ప్రతిపాదించారు. అనంతపురం నుంచి ఉరవకొండకు రోడ్డు ప్రతిపాదన కన్సల్టేషన్ స్థాయిలో ఉంది. గుత్తి – కర్ణాటకలోని బీదర్ హైవే విస్తరణ కూడా చేపట్టారు. అలాగే రూ.230 కోట్లతో గుంతకల్లు – బళ్లారి రోడ్డు విస్తరణకు కొత్తగా టెండర్ పిలిచారు.రాయదుర్గంలో రూ.54 కోట్లతో రైల్వే బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. రూ.25 కోట్లతో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి రోడ్డు విస్తరణకు టెండర్లు ఆహ్వానించారు. కదిరిలో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి ఇక రూ.30 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. రోడ్ల విస్తరణతో పాటుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయంటున్నారు. మలకవేముల జంక్షన్ కీలకంగా మారుతుందంటున్నారు. ప్రయాణ సమయం తగ్గి అమరావతికి ఐదు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ప్రస్తుతం బెంగళూరు టు విజయవాడ మధ్య నేషనల్ హైవే-544జీ పనులు కూడా చకచకా సాగుతుండటంతో బెంగళూరు, అనంతపురం నుంచి అమరావతికి , విజయవాడకు త్వరగా వెళ్లొచ్చు.. ప్రయాణ సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.

# ఏపీలో సర్..డర్

**తిరుపతి,(భారత శక్తి)** అధికార పార్టీ అయినా.. అపోజిషన్ లీడర్లు అయినా ఇప్పుడు అందరికీ ఒకటే ఫోబియా. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి.. బెంగాల్లో దీదీకి చుక్కలు కనిపిస్తున్నాయి. అటు టీఎంసీ, ఇటు డీఎంకే ఓడటమే కాదు.. రెండు పార్టీల అధినేతలు సీఎంగా ఉండి సొంత సీటులో ఓటమి చవిచూశారు. ఇదంతా సరే. ఆ స్టేట్స్లో వాళ్లిద్దరు ఓడితే.. ఏపీలో పార్టీలకు, లీడర్లకు టెన్షన్ ఎందుకనే కదా డౌట్. అక్కడికే వస్తున్నా.. కేంద్రం చేపట్టిన సర్ ప్రక్రియే.. బెంగాల్లో గెలుపోటముల్ని డిసైడ్ చేసిందన్న ప్రచారంతో ఢిల్లీ టు అమరావతి.. ఆ సర్ చుట్టూనే రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో అపోజిషన్లో వైసీపీ అయితే ఫుల్ అటెన్షన్ మోడ్లోకి వచ్చేసింది. అందరికంటే ముందే సర్ పై తాడేపల్లి క్యాంప్ ఆఫీస్లో కీలక సమావేశం నిర్వహించిన జగన్.. లీడర్లకు దిశానిర్దేశం చేశారు. అలర్ట్గా ఉండాలని.. ఎక్కడా తమ పార్టీకి చెందిన ఓటర్ల ఓట్లు పోకుండా క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్. మరణించిన, చిరునామా మారిన, అలాగే డూప్లికేట్ ఓట్లను తొలగించడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం సర్ ముఖ్య ఉద్దేశం. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకుంటూ, తాజా ఓటర్ల వివరాలు సేకరిస్తూ వస్తున్నారు. బూత్ లెవల్ అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. ఏపీలో ఈ నెల 15న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 15 వరకు.. నెలరోజుల పాటు కొనసాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు లేకపోతే అంతే సంగతులు. ఈ మాటే అటు పార్టీలకు.. ఇటు లీడర్లకు కంటిమీదు కునుకు లేకుండా చేస్తోంది. డిసెంబర్లో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ ఏడాది జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్న వాదన బలంగా ఉంది. సర్ ప్రక్రియనే కొందరు ముఖ్యనేతల తలరాతలను మార్చేసిందన్న టాక్ వినిపిస్తోంది. సర్ ప్రక్రియ కింద ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే 97లక్షల ఓట్లు తొలగించినట్లు అంచనా. ఈ ఓట్లు తొలగింపు దాదాపు 40 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ పోటీ చేసిన కొలత్తూరు నియోజకవర్గంలో ఏకంగా లక్షకు పైగా ఓట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించారు. ఆయన కొలత్తూరులో 8వేల 795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దఎత్తున జరిగిన ఓట్లు తొలగింపే కొలత్తూరులో స్టాలిన్ను ఓటమి పాలు చేసిందని బలంగా నమ్ముతున్నారు డీఎంకే నేతలు.ఇక పశ్చిమ బెంగాల్లో 91 లక్షలకు పైగా ఓట్లు డిలీటయ్యాయి. ఆ స్టేట్లోని మొత్తం ఓట్లలో ఇది దాదాపు 12 శాతం. ఒక్క ఓటుతోనే నేతల జాతకాలు, తలరాతలు మారుతున్న పరిస్థితి. అలాంటిది 12 శాతం ఓట్లు లేకుండా పోతే..రిజల్ట్ షాకింగ్గా ఎందుకుండవన్న చర్చ జరుగుతోంది. బెంగాల్లో 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 స్థానాల్లో గెలుపు మార్జిన్ కంటే, అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువ. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్లో 50 వేల ఓట్లు డిలీట్ అయ్యాయట. ఆమె 15 వేల ఓట్లతో ఓడిపోయారు. ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఓట్ల తొలగింపు..ఫలితాలు తారుమారైన సీన్ను గుర్తు చేసుకుంటే చాలు..ఏపీల పార్టీలకు వణుకు పుడుతోందటబెంగాల్, తమిళనాడు ఎన్నికలకు ముందు ూ.ఎ.ఖీపై ఏ పార్టీ పెద్ద సీరియస్గా కాన్సన్ట్రేట్ చేయలేదు. వన్స్ అక్కడ సీన్ మారిపోవడంతో ఏకంగా వరుసపెట్టి సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్ను అలర్ట్ చేస్తున్నాయి పార్టీలు. సిట్టింగ్ ఎమ్మెల్యేలే కాకుండా ప్రతిపక్ష నేతలు తమ అనుచరులను.. సర్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది వెంట తిప్పుతున్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను యాక్టివ్ చేస్తున్నారు. ఏ ఓటు తీసేస్తున్నారు.? ఏ ఓటు కలుపుతున్నారన్న దానిపై నాయకులు ఏ రోజుకు ఆ రోజు డేటా తెప్పించుకుని పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్తో అంటే ఐదు నుంచి పదివేలలోపు ఓట్ల తేడాతో విజయం సాధించిన నేతల గుండెల్లో ఎస్ఐఆర్ గుబులు రేపుతోందట. ఈ ప్రక్రియ వచ్చే ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న కంగారు నాయకుల్లో మొదలైంది.అర్బన్ ఏరియాల్లో కంటే రూరల్ ఏరియాలోని దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చాలామంది గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ఓటర్లు ఉపాధి కోసం లేక వివిధ పనుల నిమిత్తం దగ్గరలో ఉన్న నగరాలకు వెళ్తుంటారు. సర్ ప్రక్రియ కోసం సిబ్బంది ఇంటికి వెళ్లినప్పుడు..డోర్ లాక్ చేసి ఉంటే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. తాము ఊర్లోనే నివసిస్తున్నామని రుజువు చూపిస్తే తప్ప ఓటు నిలబడే అవకాశం లేదట.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు అధికార పార్టీ నేతలు అయితే ఎన్నికల సిబ్బంది వెంట తమ షాడో టీమ్లను పంపిస్తున్నారు. తమకు అనుకూలమైన ఓటర్లను తొలగించడానికి సిద్ధపడితే వెంటనే అడ్డు చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి కూడా ఇది కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. తమ ఓట్లను కాపాడుకునేందుకు ఇటు అధికార పార్టీ, అటు ప్రతిపక్ష పార్టీలు ఈ నెల రోజులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి చాలా స్పష్టంగా కనిపిస్తోంది.ఏపీలో సర్ ప్రక్రియ ముగిసేలోపు ఎన్ని ఓట్లు గల్లంతవుతాయోనన్న భయం నాయకులను వెంటాడుతోంది. గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్తో ఓడిపోయిన వారిలోనే కాకుండా, తక్కువ మార్జిన్తో గెలిచిన వారిపై కూడా ఎస్ఐఆర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చూడాలి మరి.

# కరెంట్ షాక్తో భార్యా భర్తలు మృతి



**నిజామాబాద్(భారత శక్తి)** బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో దంపతులు మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఉట్పల్లి గ్రామంలో ఉతికిన బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో, రత్నావత్ సంజీవ్(45), జ్యోతి(41) అనే దంపతులు కరెంట్ షాక్తో అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'మరీచిక' మూవీ రివ్యూ!



తెలుగు తెరపై కథానాయికలుగా అనుపమా పరమేశ్వరన్ - రెజీనా ఇద్దరూ తమ ప్రతిభను నిరూపించుకున్నవారే. ఇక 'బేబీ' సినిమాతో విరాజ్ అశ్విన్ మంచి క్రేజ్ ను సంపాదించుకున్నాడు. అలాంటి ఈ ముగ్గురూ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'మరీచిక'. సతీశ్ కాశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 29వ తేదీన థియేటర్లలో విడుదలైంది. మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 19వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. హైదరాబాద్ లోని ఒక డిగ్రీ కాలేజ్ లో వెంకటలక్ష్మి (అనుపమా పరమేశ్వరన్) చదువుతూ ఉంటుంది. అక్కడికి దగ్గరలోనే సంజయ్ ( విరాజ్ అశ్విన్) ఒక కాఫీ షాప్ ను నిర్వహిస్తుంటాడు. తొలిచూపులోనే సంజూపై మనసు పారేసుకున్న వెంకటలక్ష్మీ, అతనికి చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అలాంటి సమయంలోనే అమెరికా నుంచి వచ్చిన 'మరీచిక' (రెజీనా)తో వెంకటలక్ష్మీకి పరిచయమవుతుంది. చాలా తక్కువ రోజులలోనే వాళ్లిద్దరి మధ్య ఎక్కువ సాన్నిహిత్యం పెరిగిపోతుంది. తల్లిదండ్రులను కోల్పోయిన 'మరీచిక', హైదరాబాద్ లోని తన ఆస్తులను అమ్మేసుకుని తిరిగి అమెరికా వెళ్లే ఆలోచనలో ఉందని వెంకటలక్ష్మి తెలుసుకుంటుంది. వెంకటలక్ష్మితో పాటు తన కాఫీ షాప్ కి వచ్చిన మరీచికతో సంజూ మాటలు కలుపుతాడు. వాళ్లిద్దరి మధ్య పరిచయం చాలా ఫాస్టుగా ప్రేమగా మారిపోతుంది. అయితే సంజూ తనకి దక్కకుండా పోతుండటాన్ని వెంకటలక్ష్మీ భరించలేకపోతుంది. వాళ్లిద్దరూ గుళ్లో చేసుకున్న పెళ్లికి ఆమె ఒక ప్రధానమైన సాక్షిగా ఉండిపోతుంది. ఒకానొక సమయంలో తనకి మరీచిక చెప్పిన మాటలన్నీ అసత్యాలని వెంకటలక్ష్మి తెలుసుకుంటుంది. ఆ సమాచారాన్ని రహస్యంగా సంజూకి చేరవేస్తుంది. అయితే ఆ విషయాన్ని గ్రహించిన మరీచిక, హనీమూన్ పేరుతో సంజూని బయల్దేరదీస్తుంది. పొలిమేరలలోకి వెళ్లగానే సంజూపై ఎటాక్ చేస్తుంది. సంజూ స్నేహితులను తన వైపుకు తిప్పుకుని, వాళ్లతో కలిసి అతణ్ణి హత్య చేస్తుంది. ఈ దృశ్యాన్ని చూసిన వెంకటలక్ష్మీ ఏం చేస్తుంది? పర్యవసానంగా చోటుచేసుకునే సంఘటనలు ఎలాంటివి? అనేది కథ. ఇది ట్రయాంగిల్ లవ్ స్టోరీగా మొదలవుతుంది. సంజూను వెంకటలక్ష్మి ప్రేమించడం .. ఆమె స్నేహితురాలైన 'మరీచిక'ను సంజూ లవ్ చేయడం .. ఈ ఇద్దరి సాన్నిహిత్యాన్ని చూస్తూ వెంకటలక్ష్మి రగిలిపోవడం వంటి సన్నివేశాలతో ఈ కథ నడుస్తూ ఉంటుంది. సంజూని ఒక పథకం ప్రకారం మరీచిక హత్య చేసిందంటూ పోలీస్ స్టేషన్ కి వెంకటలక్ష్మి పరిగెత్తుకు రావడంతో కథలో ఆసక్తికరమైన అంశం మొదలవుతుంది. ఆస్తుల కోసం మరీచికను సంజూ వలలో వేసుకుంటున్నాడా? లేదంటే అతని దగ్గరున్న కోట్ల రూపాయలను కొల్లగొట్టడానికి మరీచిక ప్లాన్ చేసిందా? అనే ఒక సందేహం ఆడియన్స్ ను వెంటాడుతూ ఉంటుంది. మానసిక పరమైన ఒక వ్యాధితో వెంకటలక్ష్మి బాధపడుతుందంటూ ఇచ్చిన ట్విస్ట్ తో కథ మరో మలుపు తీసుకుని ఆడియన్స్ కి మరో క్వశ్చన్ మార్క్ వదులుతుంది. ప్రతిసారి పోలీస్ స్టేషన్ కి వెళ్లిన తరువాత, అంతకుముందు జరిగిన కథలోని సన్నివేశాలు మారిపోతూ వెళ్లడం ఉత్కంఠను పెంచుతుంది. ఇక ఈ కథ ప్రీ క్లైమాక్స్ కి చేరుకుంటూ ఉండగా, హారర్ టచ్ కూడా ఇచ్చేశారు. దాంతో క్రైమ్ థ్రిల్లర్ .. మిస్టరీ థ్రిల్లర్ .. హారర్ థ్రిల్లర్ అంశాలను ఒకే కథలో కలిపేసి అందించినట్టుగా అనిపిస్తుంది.కథ చకచకా మలుపులు తీసుకుంటూ ఉంటుంది. ఏది నిజం? ఏది అబద్ధం? అనేది తేల్చుకోనీయని ఒక గందరగోళంలో నుంచి ఉత్కంఠను వెలికి తీయడానికి ప్రయత్నిస్తుంది. అయినా రొటీన్ బారి నుంచి తప్పించుకోలేకపోతుంది. ఈ కథ ఎక్కడెక్కడో తిరుగుతూ చివరికి పోలీస్ స్టేషన్ కి చేరుకుంటూ ఉంటుంది. అయితే పోలీసులు అక్కడికి వచ్చిన వాళ్లను ప్రశ్నించి అప్పటికప్పుడే నిర్ణయాలు తీసేసుకుంటూ ఉంటారు. ఇన్వెస్టిగేషన్ కోసం క్లైమాక్స్ లో గానీ కాలు బయటికి పెట్టరు. ఇలాంటి లాజిక్కులు పట్టించుకోకుండా ఫాలో అయితే ఓ మాదిరిగా అనిపించే కంటెంట్ ఇది. రెజీనా .. అనుపమా పరమేశ్వరన్ .. విరాజ్ .. అజయ్ ఘోష్ నటన ఆకట్టుకుంటుంది. అరవింద్ ఫొటోగ్రఫీ .. ఇళయరాజా సంగీతం .. జునైద్ సిద్ధికీ ఎడిటింగ్ ఫరవాలేదు. 'మరీచిక' అంటే 'ఎండమావి' అని అర్థం. దూరం నుంచి చూస్తే నీళ్లు ఉన్నట్టుగా కనిపిస్తాయి. అక్కడివరకూ వెళితే అక్కడి నుంచి మరికొంత దూరంలో ఉన్నట్టుగా అనిపిస్తాయి. అలా ఇదే నిజం అనుకోగానే అసలు జరిగింది ఇది అంటూ మరో అంశం తెరపైకి వస్తుంది. ఆ రకంగా చూసుకుంటే టైటిల్ సెట్ అయిందనే చెప్పాలి. ట్రయాంగిల్ లవ్ స్టోరీలా మొదలుపెట్టి, ఆ తరువాత క్రైమ్ .. హారర్ .. ఎమోషన్ టచ్ ఇస్తూ వెళ్లిన తీరు బాగానే ఉంది. కానీ ఏ అంశానికి సంబంధించి కూడా గాఢత కనిపించదు. హృదయానికి హత్తుకునే అంశాలు లేకపోవడం .. లాజిక్ కి అందని సన్నివేశాలు ఎక్కువ సమయాన్ని తీసుకోవడం .. ఎటొచ్చి రొటీన్ బారిన పడటం అసంతృప్తిని కలిగిస్తుంది.

# 3డీ ఫార్మాట్‌లో హను-మాన్

యువ హీరో తేజ సజ్జా కథానాయకుడిగా, ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం పానిండియా స్థాయిలో సాధించిన విజయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2024లో విడుదలై దేశవ్యాప్తంగా రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లను రాబట్టిన ఈ చిత్రాన్ని ఈ నెల 25న 3డీ ఫార్మాట్‌లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌కి హీరో సాయిదుర్గతేజ్ అతిథిగా విచ్చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి సినిమా దొరకదని, ఇలాంటి సినిమాలో నటించే అవకాశం రావడమే అదృష్టమని హీరో తేజ సజ్జా అన్నారు. ఇంకా నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, హీరోయిన్ అమృత అయ్యర్, సంగీత దర్శకుడు గౌర హర, 3డీ కిరణ్ కూడా మాట్లాడారు.



# ఓ సుకుమారీ.. కన్నుల దారి.. నీవైపే చేరి



తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న గ్రామీణ నేపథ్య రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ..! సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకుడు. మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి టైటిల్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'హే.. ఓ సుకుమారీ.. కన్నుల దారీ.. నీవైపే చేరే సుందరీ..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా, భరత్ మంచిరాజు స్వరపరిచారు. అభిజిత్‌రావు ఆలపించారు ప్రేమలోని మాధుర్యాన్ని అందంగా ప్రజెంట్ చేస్తూ, స్వచ్ఛమైన ప్రేమగీతంలా ఈ పాట సాగింది. తిరువీర్, ఐశ్వర్య రాజేష్ తమ అభినయంతో ఆకట్టుకున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రంలో మురళీధర్‌గౌడ్, ఆమని, విష్ణు ఓయ్, ఝాన్సీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ కుషేందర్.

## నాతో నేను గడిపేందుకే ఈ నిర్ణయం



యువతలో మంచి క్రేజ్ ఉన్న కథానాయికల్లో కయాదు లోహర్ ఒకరు. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలతో ఈ అందాలభామ బిజీబిజీగా ఉన్నది. తాజాగా ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాకు కొన్నాళ్లు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని జత చేసింది. 'సోషల్‌మీడియా నుంచి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. శరీరం మాదిరిగానే మనసుకు కూడా విశ్రాంతి అవసరం. నాతో నేను ఎక్కువగా గడిపేందుకు తీసుకున్న నిర్ణయం ఇది. ఇప్పటిదాకా సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు. మళ్లీ కలవాలని అనిపిస్తే తప్పకుండా కలుస్తా' అంటూ రాసుకొచ్చింది కయాదు లోహర్. సో.. కొన్నాళ్లపాటు ఈ యంగ్ బ్యూటీ సోషల్ మీడియాలో ఉండదన్నమాట. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్'లో కయాదు కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# అదరగొడుతున్న 'జిగితార'..

## కిరణ్ అబ్బవరం కొత్త పాటకు సూపర్ రెస్పాన్స్




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా, 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన నిర్మాతలు సాయి రాజేష్, ఎస్.కె.ఎన్. నిర్మిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'జిగితార' సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. తిరుపతిలో జరిగిన ఓ భారీ సంగీత కార్యక్రమంలో ఈ పాటను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది.

ప్రేమలో ఉన్న ఓ యువకుడు తన మనసులోని భావాలను వ్యక్తపరిచేలా ఈ 'జిగితార' పాటను అద్భుతంగా చిత్రీకరించారు. లెజెండరీ సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన మనోహరమైన మెలోడీ సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గాయకుడు కార్తీక్ తన మధురమైన స్వరంతో పాటకు ప్రాణం పోశాడు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పాటలోని భావోద్వేగాలను లోతుగా ఆవిష్కరించింది. విడుదలైన క్షణం నుంచి సోషల్ మీడియాలో ఈ పాటకు అద్భుతమైన స్పందన వస్తోంది. మణిశర్మ, కార్తీక్, కిరణ్ అబ్బవరం కాంబినేషన్‌ను అభినందిస్తూ శ్రోతలు కామెంట్లు పెడుతున్నారు.ప్రేమ, కుటుంబ బంధాల చుట్టూ తిరిగే రొమాంటిక్ డ్రామాగా 'చెన్నై లవ్ స్టోరీ' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరి ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి రాజేష్ కథ అందించగా, రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న కిరణ్ అబ్బవరం కెరీర్‌కు ఈ సినిమా మరో మైలురాయి అవుతుందని అభిమానులు భావిస్తున్నారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందే 'జిగితర' పాట రూపంలో వచ్చిన ఈ సానుకూల స్పందన, సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచుతోంది.

# రొమాంటిక్‌గా రాజా ది రాజా



రుత్విక్, విశాఖ దీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. కె.నిహారిక దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కె.శ్రీలతారెడ్డి సమర్పిస్తున్నారు. జూలై 17న సినిమా విడుదల కానున్నది. ప్రతిష్టాత్మక మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో రొమాంటిక్ మూడ్‌ని ప్రజెంట్ చేస్తున్నది. డా.నరేష్ విజయకృష్ణ, సాయికుమార్, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికిరణ్ బోయిడపు, సంగీతం: మార్క్ కె.రాబిన్, నిర్మాణం: బృందావన్ క్రియేషన్స్.

# నుదుటిపై నాన్న ముద్దు



తన శైలికి భిన్నంగా భక్తి, భావోద్వేగాలతో కూడుకున్న యాక్షన్ కథాంశంతో అగ్ర హీరో రవితేజ నటిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఇందులో కూతురంటే ప్రాణమిచ్చే తండ్రిగా ఆయన కనిపిస్తారు. శివ నిర్వాణ దర్శకుడు. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఫాదర్స్ డే సందర్భంగా 'ఇరుముడి' చిత్రబృందం ఓ అందమైన ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసింది. కూతురి నుదుటిపై ముద్దిస్తున్న నాన్నలా రవితేజ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. తండ్రీకూతుళ్ల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను ఈ పోస్టర్ హృద్యంగా ఆవిష్కరించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ ఆడపిల్ల తండ్రిగా రవితేజ నట విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూస్తారని, కమర్షియల్ అంశాలన్నీ సమపాళ్లలో రంగరించిన చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ప్రియా భవానీశంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్‌ఘోష్, రమేశ్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, నిర్మాణం: మైత్రీమూవీమేకర్స్.

# చెత్తను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలి

**- గోపాల్ నగర్‌లో స్వచ్ఛ తెలంగాణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం**

**తాండూర్ (భారత శక్తి)** ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్తతో పాటు ప్రత్యేక హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య గ్రామ ప్రజలకు సూచించారు. తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రజలకు వివరించి, చెత్తను సరైన విధంగా వర్గీకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాలు, హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు గ్రామ పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద నుంచే చెత్తను వర్గీకరించే అలవాటు పెంపొందించుకోవాలని, దీంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని అన్నారు. అలాగే ఏ రకమైన చెత్తను ఏయే కంపోస్ట్ పిట్స్‌లో వేయాలో గ్రామస్థులకు ప్రాక్టికల్‌గా వివరించి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు సిబ్బందికి సహకరిస్తూ, ముందుగానే వేరు చేసిన చెత్తను మాత్రమే అందించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలందరూ గ్రామపంచాయతీ చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం



**రాయదుర్గం (భారత శక్తి)**మండలం చదం గొల్లలదొడ్డి సమీపంలోని లింగాలబండపై గల పురాతన చతుర్ముఖ పశుపతినాథ్ ఆలయంలో గుప్తనిధుల వేట కలకలం రేపింది. దుండగులు గతంలో నందివిగ్రహం, మూలవిరాట్ ధ్వంసం చేయగా, తాజాగా క్షుద్రపూజలు చేసి ధ్వజస్తంభం రాళ్లు పెకలించారు. సోమవారం పూజకు వెళ్లిన భక్తులు ఆలయంలో తవ్వకాలు చూసి ఆందోళన చెందారు. గుప్తనిధుల కోసమే ఆలయ ధ్వంసం జరుగుతోందని, పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు.

# జియో మైసూర్ సంస్థ యందు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సిరి



**తుగ్గలి:(భారత శక్తి)** తుగ్గలి మండల పరిధిలోని పగిడిరాయి గ్రామ సమీపంలో గల జియో మైసూర్ సంస్థ యందు సీఎం పర్యటనలో భాగంగా ఏర్పాట్లను కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సోమవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 24న సీఎం పర్యటనలో భాగంగా బహిరంగ సభ ఏర్పాట్లను, వాహనాల రాకపోక ఏర్పాటులను, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, నీటి వసతి, భద్రత తదితర వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలను తెలియజేశారు. సీఎం పర్యటనలో ఎటువంటి భద్రత లోపాలు లేకుండా పటిష్టమైన బందోబస్తు మరియు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఓబులేషు, తహసిల్దార్ రవి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత జాతీయ, అంతర్జాతీయ ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలి

**గోదావరిఖని(భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాయిట) వైస్ చైర్‌పర్సన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమిషనర్, అకోయిజం సోనీ బాలా దేవి, ఈరోజు సింగరేణి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులు, క్రీడా శిక్షకులు మరియు క్రీడా శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలు, పట్టణాలు మరియు సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం రామగుండంలోని సింగరేణి అతిథి గృహం ప్రాంగణాన్ని సందర్శించిన శ్రీమతి సోనీ బాలా దేవి పారిజాత మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (అటవీ) భానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సోనీ బాలా దేవి తెలిపారు .




# మనందరికి సుప్రీం లీడర్ కేసీఆర్

- ఎంపీ వద్దిరాజుతెలంగాణ ప్రజలకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష:
- ఎంపీ వద్దిరాజుబీ
- ఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యం:
- ఎంపీ వద్దిరాజు





**(భారత శక్తి)**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మనందరికి సుప్రీం లీడర్ అని, ఆయన నాయకత్వమే రాష్ట్రానికి, ప్రజలకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ పార్టీలో ముఠాలకు, వర్గాలకు ఏ మాత్రం తావు లేదని, మనమందరం కూడా కేసీఆర్ నాయకత్వాన గులాబీ జెండా కింద పని చేస్తూ ముందుకు సాగుదామన్నారు. ఖమ్మం జిల్లా వైరాలోని కమ్మ వారి కళ్యాణ మండపంలో సోమవారం సభ్యత్వ నమోదు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు జరిగింది. దీనికి ఎంపీ రవిచంద్ర, పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంఛార్జి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ఇతర పార్టీలలో మాదిరిగా బీఆర్ఎస్ లో వర్గాలు అనేవి ఉండవని, మనమంతా కూడా మహానేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుల మార్గ నిర్దేశనంలో పని చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తల పనితీరును కేసీఆర్, కేటీఆర్ లు గమనిస్తుంటారన్నారు. సభలు, సమావేశాలు ఎక్కడ జరుగుతున్నాయో, ఎవరేం పని చేస్తున్నారో, ఏం మాట్లాడుతున్నారో, ఎవరి బలమెంతనో కేసీఆర్, కేటీఆర్ లకు తెలుసని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. వారి ముందు ఎవరి ఆటలు సాగవని, సిఫార్సులు, పైరవీలు నడవని, పార్టీని నమ్ముకుని గులాబీ జెండా మోస్తూ కష్టపడి పని వారిని తప్పకుండా గుర్తించి అవకాశాలు, పదవులు ఇస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తున్నారని, గులాబీ సైనికులపై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీ రవిచంద్ర విమర్శించారు. ఆరు నెలల తర్వాత ఆయన మాటల్ని, ఆదేశాలను మంత్రులు, అధికారులు కూడా పట్టించుకోరన్నారు. రెండేళ్లలో జరిగే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అద్భుతంగా గెల్చి రాష్ట్రంలో అధికారం చేపట్టడం, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ రవిచంద్ర ధీమాగా చెప్పారు. అప్పుడు పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన వారికి పదవులు రావడం, రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందడం జరుగుతుందని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా 18 నిండిన వారందరి ఓట్లను నమోదు చేయించాలని, ఉన్న ఓట్లు గల్లంతు కాకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని గులాబీ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండాల కృష్ణ (ఆర్జేసీ), బొమ్మెర రాంమూర్తి, గిరిబాబు, కృష్ణార్జున్, మనీషా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ", "వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి", "జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్", "రేవంత్ రెడ్డి పోవాలి-కేసీఆర్ రావాలి"అనే నినాదాలు మిన్నంటాయి.

# జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రగతి

**- జిల్లా ప్రత్యేక అధికారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ అభినందించారు**



**సిద్ధిపేట(భారత శక్తి)** సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద మార్చి 16 నుంచి జూన్ 12 వరకు జిల్లాలో వివిధ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను ఆయన పరిశీలించి, సంబంధిత శాఖల నివేదికలను పరిశీలించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ కె. హైమావతిని ప్రత్యేకంగా అభినందించారు. సమీక్షా సమావేశంలో వైద్య, వ్యవసాయ, విద్య, గ్రామీణ అభివృద్ధి పోలీస్, ఐసిడిఎస్, ఫుడ్ సేఫ్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల లక్ష్యాల ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సమర్పించారు. కార్యక్రమం అమలులో ఎదురైన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారి వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి, జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో వార్డు, గ్రామ, మండల సభల ద్వారా దాదాపు 19 వేల ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందనీ ప్రత్యేక టైం బాండ్ తో ప్రణాళిక బద్ధంగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం మూలంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందనీ, ప్రత్యేక అధికారి సూచనల మేరకు టైం బాండుతో శాపలవారీగా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. పింఛన్ల దరఖాస్తు వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు మంత్రిగారి ఆదేశాల మేరకు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమం ముగింపులో ప్రత్యేక అధికారి నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రత్యేక అధికారిని చేర్యాల పెయింటింగ్స్ సత్కరించారు.

# వెంకన్న కుటుంబానికి ఉద్యోగంతోపాటు ఎక్స్ గ్రేషియా

**- మంత్రి పొన్నం**

**హైదరాబాద్ (భారత శక్తి)** భూపాలపల్లి లో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకన్న మృతి బాధాకరమని మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

ఘటనపై అయన మీడియాతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ వెంకన్న ఇటీవల జగిత్యాల నుండి భూపాలపల్లికి బదిలీ అయి వచ్చారు. యన స్వగ్రామం మహబూబ బాద్ దగ్గర మరిపెడ బంగ్లా. నిబంధనలు ఉల్లంఘించిన హార్వెస్టర్ రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తున్న సమయంలో అటు నుండి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది వెంకన్న మృతి చెందారు. రవాణా శాఖ లో ఎన్ఫోర్స్మెంట్ పెంచాం

నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు. వెంకన్న మృతిపై నేను జిల్లా కలెక్టర్, ఎస్పీ తో మాట్లాడ.. ప్రిన్సిపాల్ సెక్రటరీ తో విచారణకు ఆదేశించాం. ఎం రు ఢిల్లీలో ఉన్నారు ఘటన పై మాట్లాడారు విచారణకు ఆదేశించారూ. వెంకన్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటాం.. ఈ సమయంలో శవ రాజకీయాలు వద్దు. మైనింగ్ ,గ్రానైట్ , ఫ్లై యాష్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించాం. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది..కుటుంబానికి ఉద్యోగం తో పాటు ఎక్స్ గ్రేషియా ఇస్తాం. రోడ్ సేఫ్టీ పై మేము రోడ్డు భద్రత మాసోత్సవాలు చేసి అవగాహన కల్పిస్తున్నాం. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు చేస్తున్నాం.. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం

లైసెన్స్ రావడానికి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ చేస్తాం.. ఎవరైనా డ్రైవింగ్ స్కిల్స్ ఉంటేనే వారికి లైసెన్స్ వస్తుంది. వాహనాల వేగం పెరిగింది.. వాహనాల సంఖ్య పెరిగింది.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే మా దృష్టి కి తీసుకురండి. వెంకన్న మృతిపై ప్రాథమిక విచారణ జరుగుతుంది .. యాక్సిడెంటల్ ఘటన ఇందులో ఎవరి ప్రమేయం లేదు. ప్రాణాల మీదకు వచ్చేంత ఎన్ఫోర్స్మెంట్ చేయడం లేదని అన్నారు.

# నైపుణ్యం,సామర్థ్యం మెరుగుపడతాయి రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని(భారత శక్తి):**రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించబడింది. డీజీపీ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్?2026 కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీ-సబోటేజ్ తనిఖీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశమూ ఉంటుందని తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు, వేలిముద్రల విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, కేసుల దర్యాప్తులో మెళకువలను నేర్చుకోవడానికి, పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి అవసరమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు, సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జోన్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని, వివిధ ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య పరస్పర సహకారం, ప్రోత్సాహం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరఫున, రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- గుండాల ఎస్సై ఎం. శోభన బాబు.**

**గుండాల(భారత శక్తి)** మండలంలోని వెల్మజల గ్రామంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండాల సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శోభన బాబు ముఖ్యంగా పాల్గొని విద్యార్థులు, యువత మరియు గ్రామ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఎస్సై శోభన బాబు మాట్లాడుతూ, మత్తు పదార్థాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. డ్రగ్స్ వద్దు ? స్పోర్ట్స్ ముద్దు" అనే నినాదంతో యువతను క్రీడల వైపు మళ్లించాలని ఆయన సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్తు సాధించవచ్చని చెప్పారు. యువత తమ లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణతో కూడిన జీవనం గడపాలని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

భారత శక్తి


## 'అయోధ్యను వీడి వెళ్లొద్దు'..
### ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు



న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి , జూన్ 22: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి. రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

## ప్రజావాణిలో 125 దరఖాస్తులు స్వీకరణ

**పెండింగ్ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి**

**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 22 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మొత్తం 125 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పింఛన్లు, రెవెన్యూ తదితర అంశాలకు సంబంధించిన వినతులు ప్రజావాణిలో అందాయని, దూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా ఆయా డివిజన్ పరిధిలో తమ అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వి గిరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జడ్ పి సీఈఓ చందర్, డిఆర్ఓ పాండు జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మనిషి కర్మకాండలు స్మశానవాటికలోనే నిర్వహించాలి

**- సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**



జనగామ (భారత శక్తి )జూన్ 22: తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజుల పాటు ఎంతో వైభవంగా సాగుతుంది.ప్రకృతిని, మహిళలను గౌరవించే ఈ అద్భుతమైన పుష్పోత్సవం మహాలయ అమావాస్య నాడు ప్రారంభమై దసరాకు రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మతో బతుకమ్మ ముగుస్తుంది .బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లోని కూడళ్ళలో,వీధుల్లో,దేవాలయాల వద్ద ఆడుకుంటారు.చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు చెరువులు,కుంటలు,నదులు వంటి జలశయాల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అందులో భాగంగానే దేవరుప్పుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అధ్యక్షతన వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగని,మన గ్రామంలో బతుకమ్మలు ఆడి నిమజ్జనం చేసే వాగు ప్రదేశంలో మనిషి కర్మకాండలు నిర్వహిస్తున్నారని,తొమ్మిది రోజుల పాటు ఆడి దైవంగా కొలిచే బతుకమ్మలను అపవిత్రం చేయొద్దని,ఇక నుండి మనిషి కర్మకాండలు స్మశానవాటికలోనే నిర్వహించాలని పాలకవర్గం తీర్మానించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్రా కోమలత,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# లంక గడ్డపై భారత 'సూర్య' ప్రతాపం..
## శ్రీలంకపై 66 పరుగుల తేడాతో భారత్-ఏ ఘనవిజయం!

**- వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం..**
**కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో సరికొత్త ప్రపంచ రికార్డు!**
**- సిక్సర్లు, ఫోర్ల వర్షంతో లంక బౌలర్లను ఉతికేసిన 15 ఏళ్ల యువ సంచలనం!**
**- సమిష్టిగా రాణించిన టీమిండియా.. ట్రై-సిరీస్‌లో భారత్ జయకేతనం!**




శ్రీలంక , జూన్ 22: శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత యువ జట్టు (భారత్-ఏ) సింహస్వప్నమై గర్జించింది. పరుగుల వరద పారించిన హై-స్కోరింగ్ ఫైనల్ మ్యాచ్‌లో లంక జట్టును వారి సొంత గడ్డపైనే చిత్తు చేస్తూ 66 పరుగుల భారీ తేడాతో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బ్యాటర్ల మెరుపు ఇన్నింగ్స్‌లు, ముఖ్యంగా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ సృష్టించిన సునామీ లంక బౌలర్లను కోలుకోలేని దెబ్బతీసింది.

**-సూర్యవంశీ 'రికార్డుల' దండయాత్ర-**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు సంచలన ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ క్రీజులోకి వచ్చిన నిమిషం నుంచే లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. లంక పేసర్ మహ్మద్ షిరాజ్ వేసిన ఒకే ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టిన సూర్యవంశీ కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం (50) పూర్తి చేసుకున్నాడు. దీనితో లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే 'అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ' సాధించిన ఆటగాడిగా ఈ 15 ఏళ్ల బీహార్ కుర్రాడు ప్రపంచ రికార్డు సృష్టించాడు. మొత్తం 29 బంతులు ఎదుర్కొన్న సూర్యవంశీ10 ఫోర్లు, 8 భారీ సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి దురదృష్టవశాత్తూ సెంచరీ మిస్ అయ్యాడు.

**-పరుగుల కొండెక్కిన భారత్..**
**లంక లొంగుబాటు-**

సూర్యవంశీ ఇచ్చిన ఊపును కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (39)లు చక్కగా అందిపుచ్చుకున్నారు. దీనితో భారత్-ఏ జట్టు నిర్ణీత ఓవర్లలో 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక-ఏ జట్టును భారత బౌలర్లు తమ పదునైన బౌలింగ్‌తో కట్టడి చేశారు. లంక బ్యాటర్లు గట్టిగా పోరాడినప్పటికీ, ఒత్తిడిని అధిగమించలేక 311 పరుగులకు ఆలౌట్ అయ్యి లక్ష్యానికి 66 పరుగుల దూరంలోనే నిలిచిపోయారు.

# భూపాలపల్లిలో ఘోరం..
## వాహన తనిఖీల్లో బొగ్గు టిప్పర్ బీభత్సం,

**- డీటీఓ వెంకన్న అక్కడికక్కడే దుర్మరణం!**
**- ఆఫీస్ ముందే అనంత లోకాలకు: ఆర్టీఓ కార్యాలయం ముందే నిలబడి డ్యూటీ చేస్తుండగా వేగంగా దూసుకొచ్చిన లారీ.**
**- ఛిద్రమైన మృతదేహం: టైర్ల కింద పడి నుజ్జునుజ్జయిన అధికారి శరీరం.. కళ్లారా చూసి తట్టుకోలేకపోయిన సిబ్బంది.**
**- 15 రోజుల ముందే బదిలీ: జగిత్యాల నుంచి భూపాలపల్లికి వచ్చిన రెండు వారాల్లోనే విషాదం. డ్రైవర్ అరెస్ట్.**





భూపాలపల్లి ,భారత శక్తి ప్రతినిధి, జూన్ 22: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గుండెల్ని పిండేసే అత్యంత విషాదకర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై నిలబడి వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి (ఇూా) బి. వెంకన్న (45)ను ఒక భారీ బొగ్గు టిప్పర్ లారీ బలితీసుకుంది. పరకాల - భూపాలపల్లి ప్రధాన రహదారిపై గణపురం మండలం చెల్పూరు శివారులో ఉన్న జిల్లా రవాణా అధికారి కార్యాలయం ముందే ఈ దారుణం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం రవాణా శాఖ సిబ్బందితో కలిసి డీటీఓ వెంకన్న కార్యాలయం ముందు రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో విధుల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో పరకాల వైపు నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న ఒక బొగ్గు టిప్పర్ లారీ ఒక్కసారిగా అదుపు తప్పి వేగంగా అధికారుల వైపు దూసుకొచ్చింది.

**కళ్లముందే నుజ్జునుజ్జయ్యిన శరీరం..**

రోడ్డు పక్కన ఆపి ఉంచిన ఒక హార్వెస్టర్ వాహనాన్ని, డీటీఓ కారును ఢీకొడుతూ అక్కడ నిలబడి ఉన్న వెంకన్నపైకి ఆ లారీ దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు లారీ టైర్లు ఆయనపై నుంచి వెళ్లడంతో వెంకన్న శరీరం మొత్తం నుజ్జునుజ్జయ్యి, తీవ్ర రక్తస్రావంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కళ్లముందే తమ పైఅధికారి ప్రాణాలు కోల్పోవడంతో తోటి సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు, దిగ్భ్రాంతికి గురయ్యారు.

**- 15 రోజుల క్రితమే బదిలీపై రాక..**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న, కేవలం 15 రోజుల కిందటే (రెండు వారాల క్రితం) జగిత్యాల నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు డీటీఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

కొత్తగా బాధ్యతలు చేపట్టి రెండు వారాలు కూడా గడవకముందే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం రవాణా శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘోర ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీ డ్రైవర్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తెలుస్తోంది.

**- విచారణకు ఆదేశించిన రవాణా శాఖ మంత్రి**

ఈ ప్రమాద వార్త తెలియగానే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉంటూ రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించడం అత్యంత విచారకరమని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వెంకన్న కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# డీటీవో వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం

**- మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 22 (భారత శక్తి) సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన బొగ్గు లారీ ఘణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టిఓ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించడం పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ సంఘటనపై మంత్రి హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన ఎంతో విషాదకరమని పేర్కొంటూ, మరణించిన అధికారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రహదారి భద్రతపై నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలలో వెంకన్న చాలా చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనపై తగిన విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**మరణించిన వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.**



జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న లారీ ప్రమాదంలో మరణించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద జరిగిన దుర్ఘటనలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించటం చాలా బాధాకరమని అన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఉంచిన వెంకన్న పార్థివ దేహాన్ని దర్శించిన కలెక్టర్ భావోద్వేగానికి గురయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా జగిత్యాల జిల్లా నుండి ఇటీవల మన జిల్లాకు బదిలీపై వచ్చిన వెంకన్న విధుల నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని అన్నారు.వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వెంకన్న మహబూబాబాద్ జిల్లా మరిపెడా బంగ్లాకు చెందిన వ్యక్తి అని, 2012లో రవాణా శాఖలో ఏఎంవిఐగా ఉద్యోగం సాధించారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వెంకన్నకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వెంకన్న సంతాప సభ నిర్వహించి వెంకన్న చిత్రపటానికి పూల మాలలు వేసి 2 నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy